
శనివారం 15 మార్చి 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

జనసేనకు 12వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- చంద్రబాబు, లోకేష్
2



## శ్రీవారి కళ్యాణానికి చంద్రబాబు, లోకేష్‌కు ఆహ్వానం

2



# సంక్షేమంలో వివక్ష ఉండదు

- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సమీక్ష

2



ఉగాది తర్వాత మొదటి విడతగా

## 5వేల మందికి ఇళ్ల పట్టాలు



- మంగళగిరిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించాం
- స్వర్ణకారులను ఆదుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- మంగళగిరిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం: లోకేష్
- యర్రబాలెంలో గోశాలను ప్రారంభించిన మంత్రి లోకేష్
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

3

## డీసీహెచ్‌ఎస్‌లుగా 9మందికి పదోన్నతి



- అర్హులైన 85మంది వైద్యులలో 50మంది పదోన్నతికి నిరాకరణ
- ఆందోళన వ్యక్తం చేసిన వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్
- పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశం

6

## క్రీడారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- త్వరలోనే అందుబాటులోకి క్రీడా మైదానాలు
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

8

## అమరావతికి ప్రధాని మోదీ

ముహూర్తం నిర్ణయించనున్న రాష్ట్ర ప్రభుత్వం

8

## టోమేటో రైతులకు మహర్దశ

- నిరుద్యోగులకు ఉద్యోగాల వెల్లువ
- త్వరలో ఇంటిగ్రేటెడ్ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్
- ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిగా ఉపాధి అవకాశాలు
- ఆరునెలల్లో అందుబాటులోకి తేవడానికి కృషి
- యూనిట్లు ఏర్పాటయితే కోకొల్లలుగా ఉపాధి అవకాశాలు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్

6



## సచివులకు ఆటవిడుపు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడి నేతృత్వంలో
- క్రీడలు, సాంస్కృతిక పోటీలకు సన్నాహాలు
- బెరంపార్కులో భారీగా ఏర్పాట్లు
- పరిసరాలను పరిశీలించిన ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని

7

# సంక్షేమంలో వివక్ష ఉండదు

## టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

## మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సమీక్ష



అమరావతి (చైతన్య రథం): నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పేర్లను సిఫారసు చేసేందుకు కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని చెప్పారు. ఆయా పదవుల కోసం పార్టీకి కష్టపడిన వారి వివరాలు అందించాలని కోరారు. తెదేపాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహిం చారు. "సరైన వ్యక్తులను సరైనపదవుల్లో నియమిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 21ప్రధాన ఆలయాలకు చైర్మన్ల నియా మకం చేపడతాం. నామినేటెడ్ పదవుల కోసం 60వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తున్నాం. మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దు. రెండేళ్ల పదవీకాలం ముగిశాక మిగిలినవారికి అవ కాశాలు కల్పిస్తాం. ఇప్పటికే పదవులు తీసుకున్నవారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నట్లే ఇప్పుడూ హుందాగా వ్యవహరించాలి. తెదేపా నేతలు ఏ స్థాయిలోనూ వైకాపా నేతలతో సంబంధాలు పెట్టు కోకూడదు. నేను ఇలా చెబితే.. వైకాపాకు ఓటేసిన వారికి పథకాలు ఇవ్వొద్దన్నట్లు ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నాం. సంక్షేమ పథకాలు వేరు.. రాజకీయ సంబంధాలు వేరు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చూసే బాధ్యత మంత్రులదే. జిల్లా ఇన్చార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలి.. కూటమిలోని మూడు పార్టీల నేతలు, కార్యకర్తలను కలుపుకొని ముందుకెళ్లాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# స్వామి కళ్యాణానికి చంద్రబాబుకు ఆహ్వానం




అమరావతి (చైతన్య రథం): మంగళగిరి వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగే శ్రీనివాస కల్యాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానిస్తూ తితిదే ఆహ్వాన పత్రిక అందచేసింది. శుక్రవారం చంద్రబాబును ఉండవల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు.. స్వామివారి కళ్యాణోత్సవ ఏర్పాట్లను వివరించి.. కళ్యాణమహెూత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. సీఎం చంద్రబాబును కలిసిన వారిలో తితిదే బోర్డు సభ్యులు, ఈవో శ్యామలరావు, జెఈవో వెంకన్న చౌదరి తదితరులు ఉన్నారు.

### మంత్రి లోకేష్‌కు ఆహ్వానం

విద్య, ఐటి మంత్రి నారా లోకేష్‌ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు, ఈఓ శ్యామలరావు, జేఈఓ వెంకయ్య చౌదరి ఉండవల్లి నివాసంలో కలిశారు. నేడు వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగే శ్రీనివాస కళ్యాణోత్సవానికి మంత్రి లోకేష్‌ను ఆహ్వానిస్తూ.. ఆహ్వానపత్రాన్ని అందించారు.



## జనసేనకు 12వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): జన'సేవా' నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా కొనసాగు తోన్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెదేపా అధి నేత, ముఖ్యమంత్రి చంద్రబాబు శుభా కాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్, పార్టీ ముఖ్య నాయకు లకు, జనసైనికులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌తో కలిసి ఉన్న ఫొటోను చంద్రబాబు షేర్ చేశారు.

### పవన్ అన్నకు అభినందనలు: నారా లోకేశ్

"జనసేన 12వ వ్యవస్థాపక దినోత్స వం సందర్భంగా పవన్ కల్యాణ్ అన్నకు అభినందనలు. జనసేన నాయకులు, కార్యకర్తలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఏపీ ఆర్థిక, సామాజికవృద్ధికి జనసేన నిబద్ధత ప్రశంసనీయం. రాష్ట్ర పురోగతి, శ్రేయస్సులో జనసేనపాత్ర అందరికీ ఉజ్వల భవిష్యత్తును ప్రేరేపిస్తుంది" అని ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన జనసేన ఆవిర్భావ సభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి జనసైనికులు తరలి వచ్చారు. దీంతో పిఠాపురం పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి.

# స్వామి కళ్యాణం చూతము రారండి

- 27 వేలమంది భక్తులు తిలకించేలా ఏర్పాట్లు
- శ్రీనివాస కళ్యాణోత్సవానికి 300 ప్రత్యేక బస్సులు
- ఏర్పాట్లపై సమీక్ష అనంతరం మీడియాతో తితిదే ఈవో

అమరావతి (చైతన్య రథం): సీఆర్డీఏ పరిధిలోని వెంకటపాలెంలో శనివారం సాయంత్రం నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని 27 వేలమంది భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్టు తితిదే ఈవో జె శ్యామలరావు వెల్లడించారు. శు క్రవారం ఉదయం ఆలయం ముందున్న క్యాంపు కార్యాలయంలో తితిదే అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రకటించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వేంకటపాలెం చేరేందుకు వీలుగా తితిదే దాదాపు 300 బస్సులను ఏర్పాటు చేసింది. తుళ్లూరు, తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల ప్రజలు సులువుగా కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేశారు. అదేవిధంగా విజయవాడ నుంచి అమరావతికి బస్సు సౌకర్యం విరివిగా ఉన్న నేపథ్యంలో మందడం నుండి ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటు చేశారు. తద్వారా మందడం నుండి కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకునేందుకు బస్సు సౌకర్యం కల్పించింది. అదేవిధంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల్లో పుష్పాలంకరణ చేసేందుకు వేగంగా పనులు జరుగుతున్నాయి. దాదాపు 4 టన్నుల ఫ్లవర్స్, 30,000 క్లట్ ఫ్లవర్స్, ఆలయంలో మామిడి, అరటి, టెంకాయ తోరణాలతో అలంకరించనున్నారు. శ్రీవారి కల్యాణానికి పూలమాలలు తితిదే గార్డెన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.



హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గం.ల నుండి 5 గం.ల వరకు చెన్నైకి చెందిన నిత్యశ్రీ మహదేవన్ గ్రూప్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి. సాయంత్రం 5 గం.ల నుండి 6.15 గం.ల వరకు చెన్నైకి చెందిన ప్రియా సిస్టర్స్ అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తారు. అనంతరం కల్యాణోత్సవంలో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కీర్తనలను ఆలపించనున్నారు. శ్రీనివాస కళ్యాణోత్సవానికి వచ్చే భక్తులకు శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కంకణాలు, శ్రీవారి పుస్తక ప్రసాదం, కల్యాణోత్సవం అక్షింతలు కలిపి ఒక బ్యాగ్‌లో పంపిణీ చేయనున్నారు. శ్రీనివాస కల్యాణ వేదిక ప్రాంగణ ప్రాంతంలో 5 వేల ఫ్లడ్ లైట్లు, 25 జనరేటర్స్, 18 ఎల్ఈడీ స్క్రీన్‌లు, దశావతారాలు, శ్రీవేంకటేశ్వరుడు, శ్రీ పద్మావతీ అమ్మవార్ల కటౌట్లు, ఆలయ పరిసరాలలో 60 తోరణాలతోపాటు శ్రీవేంకటేశ్వర ఆలయంలో విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి, జిల్లా కలెక్టర్ సర్వశ్రీ నాగలక్ష్మీ, జేఈవో వి వీరబ్రహ్మం, సీవీఎస్వో హర్షవర్ధన్ రాజు, ఎస్పీ సతీష్ కుమార్, పలువురు జిల్లా, తితిదే అధికార్లు పాల్గొన్నారు.

చైతన్యరథం

## ఉగాది తర్వాత మొదటి విడతగా

# 5వేల మందికి ఇళ్ల పట్టాలు

- మంగళగిరిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించాం
- స్వర్ణకారులను ఆదుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- మంగళగిరిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం: లోకేష్
- యర్రబాలెంలో గోశాలను ప్రారంభించిన మంత్రి లోకేష్,
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించామని, 100 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామంలో ఆధునీకరించిన శ్రీ భగవాన్ మహవీర్ గోశాలను, నూతన సముదాయాలను మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. శ్రీ భగవాన్ మహవీర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. గోపాల మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. జైన్ సోదరులు యర్రబాలెం గ్రామంలో గత 25 ఏళ్లుగా గోశాల నిర్వహిస్తున్నారు. రెండు ఆవులతో మొదలైన గోశాల 450 ఆవులకు చేరింది. వారికి అండగా నిలబడేందుకు, వారిని ప్రోత్సహించేందుకు, వారు చేస్తున్న మంచి కార్యక్రమాలను చూసేందుకు నేను, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇక్కడకు వచ్చాం. జైన్ సోదరులు చేస్తున్న కార్యక్రమాలు చూస్తుంటే ఆనందంగా ఉంది. మంగళగిరిలో ఆవులన్నీ రోడ్లపై తిరిగేపరిస్థితి. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి. ఓవైపు శ్రీ భగవాన్ మహవీర్ గోశాల, మరోవైపు లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కూడా గోశాలను తిరిగి ప్రారంభించడం జరిగింది. మంగళ గిరి పట్టణంలో ఆవులు వీధుల్లో తిరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గోశాలలు పెడితే బాగుంటుందనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.

### మంగళగిరిలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించాం

మంగళగిరి నియోజవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల సమయంలో కోరాను. అప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పడం జరిగింది. ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మంగళగిరిలో నాకు మెజార్టీ ఇవ్వడం జరిగింది. రాష్ట్రస్థాయిలో మూడో అత్యధిక మెజార్టీ సాధించాను. ప్రజలు నన్ను దీవించారు. నా గౌరవం నిలబెట్టారు. వారికి నేను రుణపడి ఉంటాను. మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### మొదటి విడతలో 5వేల మందికి ఇళ్ల పట్టాలు

ప్రభుత్వ, కొండ పోరంబోకు, చెరువు, రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి ఇంటిపట్టాల కోసం ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. నిన్న గురువారం మొదటి పట్టా ఇప్పటంలో జనరేట్ అయింది. మొదటి విడతలో సుమారుగా 5వేల మందికి ఉగాది తర్వాత ఇళ్ల పట్టాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. రెండో విడత, మూడో విడతలో మిగిలిన ఇళ్ల పట్టాలు అందిస్తాం. కాలువలు, అటవీ భూముల్లో ఇళ్ల పట్టాలకు కొంత సమయం పడుతుందని ఆనాడే చెప్పాను. కేంద్రమంత్రి పెమ్మసాని సహకారంతో రైల్వే మంత్రిని కలిసి రైల్వే భూములు క్రమబద్ధీకరించాలని కోరినప్పుడు సానుకూలంగా స్పందించారు. ఇందుకు పెమ్మసాని కృషి ఎంతో ఉంది. నిడమర్రు గేటువద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి విషయంలో కూడా పెమ్మసాని చొరవ తీసుకున్నారు. త్వరలో పనులు ప్రారంభించబోతున్నాం. ఇళ్ల పట్టాల విషయంలో మహానాడు ప్రాంతంలో రీటైనింగ్ వాల్ నిర్మించాలని ప్రజలు కోరారు. ఇప్పటికే నిధులు కేటాయించాం. డిజైన్ పనులు జరుగుతున్నాయి. 4 లైన్ల రోడ్డు కూడా నిర్మిస్తామని లోకేష్ అన్నారు.

### నియోజకవర్గంలో 100 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

పార్క్‌లు, చెరువులు, స్మశానవాటికలు, కమ్యూనిటీ భవనాలు, రైతుబజార్లు, బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి.. ఇలా దాదాపు 100 అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అన్ని డిజైన్లు పూర్తయ్యాయి. టెండర్ దశకు వచ్చాయి. ఏప్రిల్, మే మాసంలో పూర్తిచేసి భూగర్భ డ్రైనేజీ, అండర్ వాటర్ పైప్‌లైన్, గ్యాస్, పవర్ కూడా ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఏపీలో ఎన్నడూ జరగనివిధంగా పనులు చేస్తానని లోకేష్ హామీ ఇచ్చారు.

### స్వర్ణకారులను ఆదుకుంటాం

మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ ఏర్పాటుచేస్తాం. భూములు కూడా పరిశీలించడం జరిగింది. డిజైన్ వర్క్ జరుగుతోంది. స్వర్ణకారులను ఆదుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వారికోసం కార్పొరేషన్ ఏర్పాటుచేశాం. ఈ బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించడం జరిగింది. స్వర్ణకారులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. పట్టాలు అందించిన తర్వాత ఇళ్లులేని వారికి జీప్లస్-3 విధానంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కేంద్రంలో మోడీ, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవనన్న, నేను కలిసికట్టుగా మంగళగిరి అభివృద్ధి కోసం కష్టపడతాం. ప్రజలకు ఇచ్చిన హామీలను పద్ధతిప్రకారం నెరవేరుస్తాం. ప్రభుత్వానికి ఇబ్బందులు ఉన్నచోట సొంత నిధులిచ్చి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని లోకేష్ స్పష్టం చేశారు.

### మంగళగిరిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తా

మంగళగిరిలో ట్రాఫిక్ సమస్యను 8నుంచి 12 నెలల్లో పరిష్కరిస్తాం. సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తిచేసిన తర్వాత ఈ-11, ఈ-13, వెస్టన్ బైపాస్‌ను జాతీయ రహదారికి అనుసంధానిస్తాం. సీతానగరంలో రీటైనింగ్ వాల్, 4లైన్ల రోడ్డు నిర్మిస్తాం. కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ డిజైన్ రూపొందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ ప్రసాదం కార్యక్రమం కింద

- (మిగతా వివరాలు 4లో)







చైతన్యరథం

## ఉగాది తర్వాత మొదటి విడతగా

# 5వేల మందికి ఇళ్ల పట్టాలు

(3వ పేజీ తరువాయి)

మంగళగిరిలో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలను అభివృద్ధి చేస్తాం. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వారణాసిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తాం. ప్రస్తుతం ప్రణాళిక దశలో ఉన్నాం. రోడ్లు, వసతి సౌకర్యం కల్పించడంతో పాటు ఆడిటోరియం నిర్మిస్తామని ప్రకటించారు.

**కక్షసాధింపులు ఉండవు**

కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపులకు పాల్పడటం లేదు. చట్టాలను ఉల్లంఘించిన వారిపైనే చర్యలు తీసుకుంటాం. తప్పుచేసిన వారిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు. వీసీల నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాం. గతంలో తప్పుచేసిన వీసీలను వదిలిపెట్టం. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిని సర్వనాశనం చేసింది. డీవాటరింగ్‌కే మాకు సమయం పట్టింది. అమరావతిలో పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. ఏప్రిల్‌లో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.




కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో పసుపు దగ్ధంతో రైతులకు రూ.40 కోట్ల నష్టం కలిగింది. వచ్చే రెండు వారాల్లో పసుపు రైతులకు పరిహారం అందిస్తామన్నారు. ఎయిమ్స్ ఆసుపత్రి సామర్థ్యాన్ని 60శాతం నుంచి 100శాతానికి పెంచుతామని ప్రకటించారు.

**జైనులకు అండగా నిలబడతాం: మంత్రి లోకేష్**

అంతకుముందు గోశాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. గోసేవ చేస్తే దేవుడికి సేవచేసినట్లే. కనిపించే దైవం గోమాత. గోసంరక్షణ అనేది మనందరి బాధ్యత. నేను మంత్రి అయిన తర్వాత మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గోశాలను తిరిగి ప్రారంభించాం. ఆవు పాలు చాలా ఆరోగ్యకరం. శ్రీ భగవాన్ మహవీర్ గోశాల ఆధ్వర్యంలో మరో రెండు గోశాలలను ప్రారంభించడం ఆనందంగా ఉంది. అందరం కలిసికట్టుగా గోసంరక్షణకు కృషిచేద్దామని చెప్పడం చాలా మంచి మాట. దానిని ఆచరణలో పెట్టడం అభినందనీయం.

కూటమి ప్రభుత్వంలో గోసంరక్షణకు కృషిచేస్తున్నాం. గోకులం, గోశాలలను పెద్దఎత్తున ఏర్పాటుచేయాలని మన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం జైనులకు అండగా నిలబడుతుంది. మీరు అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సేవ మీ రక్తంలోనే ఉంది. మీకు అండగా నిలబడాల్సిన బాధ్యత తమపై ఉందని, జైనులకు ఏ సమస్యలున్నా పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు. కార్యక్రమం అనంతరం మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.













చైతన్యరథం



# స్వామి రథంలాగిన మంత్రి లోకేష్

### మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్యరథోత్సవానికి హాజరు

మంగళగిరి (చైతన్య రథం): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య రథోత్సవంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. జై నారసింహ, గోవింద నామస్మరణల మధ్య రథాన్ని లాగారు. స్వామివారి దివ్యరథోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పురవీధులు భక్త జనప్రవాహంతో కిక్కిరిసి పోయాయి. రథాన్ని లాగేందుకు అందరూ పోటీపడ్డారు. అర్చకులు స్వామివారికి హారతి ఇచ్చి దివ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. అంతకుముందు స్వామివారి రథోత్సవంలో పాల్గొనేందుకు దేవాలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.











# టోమేటో రైతులకు మహర్దశ

- నిరుద్యోగులకు ఉద్యోగాల వెల్లువ
- త్వరలో ఇంటిగ్రేటెడ్ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్
- ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిగా ఉపాధి అవకాశాలు
- ఆరునెలల్లో అందుబాటులోకి తేవడానికి కృషి
- యూనిట్లు ఏర్పాటయితే కోకొల్లలుగా ఉపాధి అవకాశాలు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్




కర్నూలు, (చైతన్యరథం): కేవలం నెలల్లో ఇంటిగ్రేటెడ్ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.

శుక్రవారం పత్తికొండ మండలం, దూదేకొండ రెవెన్యూ గ్రామం,కోతిరాళ్ళ పంచాయతీ వద్ద రూ.11 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి మంత్రి టీజీ భరత్..ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి భూమి పూజ నిర్వహించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కర్నూలు ఎంపీ, పత్తికొండ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. స్పందించిన సీఎం వెంటనే అందుకు సంబంధించిన పనులు చేయాలని ఆదేశించారన్నారు.ఆ మేరకు ఈ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం నిధులు పుష్కలంగా ఉన్నాయని, 6 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ, కాంట్రాక్టర్లను ఆదేశించారు.. యూనిట్ స్థాపన త్వరగా పూర్తయితే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు స్థాపనకు 11 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ప్రాజెక్టు ద్వారా 32 మందికి ప్రత్యక్షంగా, 100 మందికి పరోక్షంగా ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. టొమాటో కేచప్, టొమాటో పేస్ట్, టొమాటో పికిల్ తదితర ఉత్పత్తులు తయారు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏ రకమైన బాటిల్‌లో అయినా కేచప్ ఒకటే రకంగా ఉంటుందన్నారు. ఇక్కడ టొమాటో పంట పండించే రైతులతో మాట్లాడి ప్రత్యేకమైన జీన్‌తో టొమాటో పంట పండిస్తే అదే రకమైన కేచప్ లాగా ఉండడంతో పాటు నాణ్యత కూడా ఉండడంతో అమ్మకాలకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. టొమాటో పంటలు పండించే రైతులకి అటువంటి విషయాల గురించి వారిలో అవగాహన కల్పించాలని కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టొమాటో పల్ప్ తయారుకు పూనుకుంటే రోజుకు 10 నుండి 15 మెట్రిక్ టన్నులు చేయవచ్చునన్నారు.. డీహైడ్రేషన్‌కు రోజు 5 మెట్రిక్ టన్నులు చేయవచ్చునన్నారు. ఒకవేళ టొమాటో పంట లేని పక్షంలో మామిడి, బనానా, పపాయ, జామ పండ్లను ప్రాసెస్ చేసుకోవచ్చునన్నారు. జిల్లాలో పత్తికొండ ప్రాంతంలో టొమాటో పంట సాగు చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ యూనిట్ ఏర్పడిన తర్వాత టొమాటోలు రోడ్ల మీద పడేసే పరిస్థితి ఎక్కడ ఉండదన్నారు. రానున్న రోజుల్లో ప్రైవేట్ వ్యక్తులు కూడా చాలా మంది ఈ యూనిట్‌లు పెట్టేందుకు ముందుకు వస్తారన్నారు. అదే విధంగా తుగ్గలి, దేవనకొండ, క్రిష్ణగిరి, ఆదోని, గొనేగండ్ల, ఆస్పరి, ఆలూరు ప్రాంతాల వారికి ఈ యూనిట్ చాలా ఉపయోగపడే అవకాశం ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ అంశంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించిన సమయంలో ఈ 5 ఏళ్లలో 30 వేల కోట్ల పెట్టుబడులు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ద్వారా రావాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ మేరకు టార్గెట్ పెట్టుకొని కష్టపడుతున్నట్లు చెప్పారు. దుబాయికి వెళ్ళిన సమయంలో ఫుడ్ ప్రాసెసింగ్‌కి సంబంధించి చాలా మంది పారిశ్రామిక వేత్తలను కలవడం జరిగిందన్నారు. వారిని కూడా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని అభ్యర్థించామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన వాటిలో ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువ స్థాయిలో వచ్చే అవకాశం ఉందన్నారు. 2014 నుండి 2019 సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు జరిగిందన్నారు. అప్పుడు చంద్రబాబు శంకుస్థాపన చేసిన స్టీల్ ప్లాంట్ గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. అన్నింటినీ అధిగమించి వచ్చే నెల 19వ తేదీన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వలసలు నివారించి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో చాలా మేరకు పెద్ద ఎత్తున్న పరిశ్రమలు రానున్నాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్ కూడా అవసరమన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా పెన్షన్ మొత్తాన్ని మన రాష్ట్రంలో ఇస్తున్నామన్నారు. వైజాగ్‌లో కూడా ఎన్నో దిగ్గజ ఐటీ కంపెనీలు రానున్నాయన్నాయని మంత్రి పేర్కొన్నారు.

## డిసిహెచ్‌ఎస్‌లుగా 9మందికి పదోన్నతి

- అర్హులైన 85మంది వైద్యులలో 50మంది పదోన్నతికి నిరాకరణ
- ఆందోళన వ్యక్తం చేసిన వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్
- పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): జిల్లాస్థాయిలో ఏర్పడిన జిల్లా ఆరోగ్యసేవల సమన్వయకర్తల పోస్టులకు శుక్రవారం చేపట్టిన భర్తీ ప్రక్రియలో తొమ్మిదిమంది ప్రభుత్వ డాక్టర్లు పదోన్నతి పొందారు. ప్రస్తుతం 6 డిసిహెచ్‌ఎస్ పోస్టులు ఖాళీగా ఉండగా, త్వరలో మరో 2 ఖాళీలు ఏర్పడనున్నాయి. వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ 9మందికి డిసిహెచ్‌లుగా పదోన్నతులను శుక్రవారం ఆమోదించారు. జిల్లా స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సిహెచ్‌సిలు), జిల్లా మరియు ఏరియా ఆసుపత్రుల పనితీరును జిల్లా ఆరోగ్యసేవల సమన్వయకర్తలు పర్యవేక్షిస్తారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ కింద పనిచేసే సిహెచ్‌సి, జిల్లా, ఏరియా ఆసుపత్రులు మొత్తం 224 ఉన్నాయి.

సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ హోదాలో మూడేళ్లపాటు సేవలందించి, పదవీ విరమణకు ముందు రెండేళ్ల సర్వీస్ మిగిలివున్న వైద్యులు డీసీహెచ్‌ఎస్‌గా పదోన్నతికి అర్హులవుతారు. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు మరియు ప్రకాశం జిల్లాల డీసీహెచ్‌ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో త్వరలో ఖాళీలేర్పడతాయి. పదోన్నతికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించిన వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, పదోన్నతికి అర్హులైన 85మంది అభ్యర్థులలో 50మంది డీసీహెచ్‌ఎస్‌గా పదోన్నతికి నిరాకరించినట్టు గమనించారు. అర్హత కలిగిన వైద్యులలో 59శాతం మంది పదోన్నతికి ఇష్టపడకపోవడంపట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలో 33శాతం మంది అర్హత కలిగిన వైద్యులు ప్రొఫెసర్లుగా పదోన్నతికి నిరాకరించిన నేపథ్యంలో తాజాగా డీసీహెచ్‌ఎస్‌గా పదోన్నతికి నిరాకరించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సెకండరీ మరియు టెర్షియరీ హెల్త్‌కేర్‌లో పనిచేసే ప్రభుత్వ వైద్యులు పదోన్నతులను తిరస్కరించడానికి గల కారణాలు మరియు సాధ్యమయ్యే పరిష్కార చర్యలను క్షుణ్ణంగా సమీక్షించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులందచేసిన సమాచారం ప్రకారం, చాలామంది ప్రభుత్వ వైద్యులు తమకు నచ్చిన ప్రదేశాలలో మాత్రమే పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. తమకునచ్చిన ప్రదేశాలలో పోస్టింగ్స్ రాకపోవటంతో పదోన్నతికి ఇష్టపడని పరిస్థితికి దారితీస్తోంది. ఫలితంగా... పదోన్నతికి అర్హులైన వైద్యులు తమకునచ్చిన ప్రదేశంలో పోస్టింగ్ పొందేవరకు అదేవిధంగా తిరస్కరిస్తున్నారని ఉన్నతాధికారులు మంత్రికి సమర్పించిన నివేదికలో తెలియచేశారు. ఈ పరిస్థితిని నిశితంగా పరిశీలించి అవసరమైన పరిష్కార చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.




## ఇఫ్తార్ విందులో ఎంపి కేశినేని

### మసీద్ నిర్మాణానికి ప్రభుత్వం సాయం కోరుతూ వినతి పత్రం

విజయవాడ (చైతన్య రథం): ఆటోనగర్ కాలనీలోని మస్జిదే కౌసర్ (మసీద్)లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి పండ్లుతిని గంజి తాగారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్ ఆధ్వర్యంలో మసీద్ కమిటీ పెద్దలు ముస్లిం మత సంప్రదాయ పద్ధతుల్లో ఎంపి కేశినేని శివనాథ్‌ను సత్కరించారు. మసీద్ నిర్మాణ విషయంలో గత ప్రభుత్వం నుంచి ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ.. మసీద్ నిర్మాణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అందించేలా చూడాలని వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం రోడ్డు వెడల్పు పనులకు అడ్డుగా ఉందంటూ మసీద్‌ను పక్కకు జరపాలని కోరిందని, కానీ ప్రభుత్వం చూపిన స్థలంలో మసీద్ నిర్మాణానికి ఒక రూపాయి కూడా సాయం చేయలేదని వివరించారు. ఆటోనగర్ కాలనీలోని ముస్లిములు చందాలు వేసుకుని నిర్మాణం కొనసాగిస్తున్నారని, మూడు కోట్లు ఖర్చయ్యే నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం ఇప్పించాలని కోరారు. ఎంపి కేశినేని శివనాథ్ వారి సమస్యపై సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ ముస్లిం సమాజం పారిశ్రామికంగా అభివృద్ధి చెందటానికి సీఎం చంద్రబాబు అందిస్తున్న పథకాలు వినియోగించుకుని ఎంటర్‌ప్రెన్యూర్లుగా ముందుడుగు వేయాలన్నారు. ఇందుకోసం స్వయం ఉపాధి రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో శిక్షణ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం వర్గాలకు శివనాథ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షులు షాబాజ్, సెక్రటరీ అబ్దుల్ కలాం, కోశాధికారి హబీబుల్లా ఖాన్, ఖలీద్, విజయవాడ అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎమ్‌డి ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# అనేక యుద్ధముల ఆరితేరిన మూర్తి.. స్ఫూర్తి

**చంద్రబాబు మొట్టమొదటిసారి శాసనసభలోకి (మార్చి 15, 1978) అడుగుపెట్టి ఈరోజుకి 47 ఏళ్లయిన సందర్భంలో ప్రత్యేక వ్యాసం**



ఆధునిక భారతావని క్రాంతదర్శుల్లో ఒకరు –చంద్రబాబు. క్రియాశీలిగా.. ప్రగతి సాధకునిగా.. ప్రేరణాశక్తిగా.. దార్శనికుడిగా.. సౌమ్యుడిగా.. సహనశీలుడిగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన కార్యదక్షుడు. ఎన్టీఆర్ నెలకొల్పిన తెలుగు ఆశయానికి మహా నాయకుడు. ప్రజాజీవన మార్గంలో మహానాయకుడి నిర్విరామ రాజకీయ ప్రస్థానానికి నేటికి 47 ఏళ్ళు. విద్యార్ధి దశనుండే నాయకత్వ లక్షణాన్ని ప్రదర్శించి.. చంద్రగిరినుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది 1978 మార్చి 15న ఎమ్మెల్యేగా చట్టసభలోకి అడుగుపెట్టిన సందర్భం.. నేటికి నలభైయేడేళ్లు. నాలుగున్నర దశాబ్దాలకుపైగా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎదురైన సవాళ్లు సంక్షోభాలనే అవకాశాలుగా మలచుకొని ఎదిగిన దార్శనిక నేత చంద్రబాబు. యువ నాయకుడిగా శాసన సభకొచ్చి.. అంజయ్య కేబినెట్‌లో 28 ఏళ్లకే గ్రంథాలయాలు, సినిమాటోగ్రఫీ మంత్రి అయ్యారు. 1982 ఫిబ్రవరి 24న భవనం వెంకట్రామ్ కేబినెట్‌లో చిన్న నీటిపారుదల శాఖామంత్రిగా, 1982 సెప్టెంబర్ 20న కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో సాంకేతిక విద్యామంత్రిగా తనను తాను నిరూపించుకున్న నాయకుడు చంద్రబాబు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా, మరో పదేళ్లు ప్రతిపక్షనేతగా, విభజితాంధ్రకు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా, ఐదేళ్లు ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించిన మాననీయుడు. ఇప్పుడు ఏపీలో నడుస్తున్నది చంద్రబాబు 4.0 పాలన. గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేకున్నా –తన రాజకీయ సౌధాన్ని తానే నిర్మించుకున్న చంద్రబాబుకు 1978 సంవత్సరం చాలా కీలకం. సుదీర్ఘకాలం ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటూ మనగలిగిన నాయకుడు వర్తమాన రాజకీయ చరిత్రలో మరొకరు లేరు. కఠోరశ్రమ, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవనశైలి, వేలెత్తి చూపడానికి అవకాశమివ్వని వ్యక్తిత్వం ఆయన ఆస్తిపాస్తులు. భావితరాల శ్రేయస్సుకు నిరంతరం శ్రమిస్తూ.. ఆలోచిస్తూ.. వినూత్న ప్రణాళికల రూపశిల్పిగా చంద్రబాబు తనకు తానే సాటి. విజనరీగా తెలుగుజాతి భవితను తీర్చిదిద్దడమే కాదు, వినూత్న విధానాలతో నవ్యాంధ్రకు నాందిపలికి దేశ రాజకీయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మేటి చంద్రబాబే!

రాష్ట్రం కోసం రెక్కలు ముక్కలు చేసుకునే శ్రామికుడు. గాంధీ ఆశయాలే ఆలంబనగా ప్రజలనుంచి పుట్టుకొచ్చిన అరుదైన నాయకుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవ చిహ్నమైతే.. చంద్రబాబు తెలుగువారి ఆత్మవిశ్వాసానికి ప్రతీక. తెలుగు జనోద్ధరణకు నిరంతర కృషిసలిపే మహర్షి. తెలుగు ప్రజలను ప్రగతిపథంవైపు నడిపించాలని తపన పడుతున్న నాయకుడు. సరికొత్త లక్ష్యాలతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగుజాతికి అందించిన దార్శనికుడు. పేదరికంలేని సమాజావిష్కరణే లక్ష్యంగా.. 47ఏళ్ళుగా జీవితాన్ని అంకితం చేసిన ప్రజా నాయకుడు. రాజకీయ పక్షాల సహజ వైఖరికి భిన్నమైన పాలన, తనదైన విజన్‌తో అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన నేతా చంద్రబాబే! 74 ఏళ్ల వయస్సులోనూ నవయువకులను మించి పని చెయ్యడం ఆయన మనోబలానికి నిలువెత్తు నిదర్శనం. ఏపీని పాలించిన ముఖ్యమంత్రులలో చంద్రబాబుకి ప్రత్యేక స్థానం. రాజకీయమంటే అధికారం అనుభవించడం కాదు, రాజకీయమంటే ప్రజలకు కూలి చేయడమని విశ్వసించే నిరాడంబరుడు. తెలుగు ప్రజలకు సంపద వృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, ఉపాది అవకాశాలను విస్తారంగా కల్పించిన ఘనత ముమ్మాటికీ చంద్రబాబుదే. ఉమ్మడి ఏపీలో తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సాహసోపేత సంస్కరణలు, అందించిన సరికొత్త పథకాలు, అనుసరించిన కొంగొత్త విధానాలు.. ఆయనను పరిపాలనాదక్షునిగా నిలబెట్టాయి. హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చిరునామా అయితే.. ఐటీ ప్రపంచానికి హైదరాబాద్ ఒక చిరునామా. తెలుగు ప్రజలకు ప్రపంచవ్యాప్త కీర్తిని సముపార్జించిన ఆధునిక నాయకులలో –చంద్రబాబుదే అగ్రస్థానం.

చంద్రబాబు సామాన్యంగా కనిపించే ప్రత్యేక వ్యక్తి. అందుకే –ఆర్థికవేత్తలు, సాంకేతిక నిపుణులు, జర్నలిస్టులు, వర్శిటీల మేధావులు, పరిశోధకులు.. అనేక విషయాలలో చంద్రబాబును కోట్ చేసిన సందర్భాలు కోకొల్లలు. అమెరికా అధ్యక్షుడు క్లింటన్ సైతం 'మై లైఫ్' బుక్‌లో చంద్రబాబు తనను హైటెక్ సిటీకి ఆహ్వానించి అబ్బురపరిచిన విషయాన్ని రికార్డు చేయడం.. ప్రపంచస్థాయి నాయకులనూ చంద్రబాబు ఎలా ప్రభావితం చేయగలరో చెప్పక చెప్పడమే. బిల్‌గేట్స్‌లాంటి దిగ్గజాలూ.. చంద్రబాబును తన మిత్రుడిగా చెప్పుకొంటూ.. 'మీ దార్శనికతకు ముగ్ధుడినయ్యాను' అనడం –చంద్రబాబు స్థాయిని గౌరవించడమే. చంద్రబాబు ఎమ్మెల్యే అయ్యేనాటికి మోదీ ఆర్‌ఎస్‌ఎస్‌లో విభాగ్ ప్రచారక్ మాత్రమే. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే.. ఆరేళ్ల తరువాత 2001లో మోదీని వరించింది ముఖ్యమంత్రి పదవి. ఏడుపదులు దాటిన సీఎంల విషయంలో చంద్రబాబే సీనియర్. ఒక ప్రాంతీయ పార్టీని నాలుగు దశాబ్దాలుగా బలోపేతం చేస్తూ ఉమ్మడి ఉమ్మడి, విభజిత ఏపీలో బలీయమైన రాజకీయ శక్తిగా నిలిపిన ఘనత ముమ్మాటికీ చంద్రబాబుదే. నిజానికి –రాష్ట్ర విభజన ఆంధ్రను అతలాకుతలం చేసింది. అవశేషాంధ్రప్రదేశ్ కోలుకోలేని స్థితికి చేరింది. క్లిష్ట సమయంలో నూతన రాష్ట్రావిష్కరణ, అభివృద్ధిని సమర్థంగా నిర్వహించారు చంద్రబాబు. పునాదులనుంచి రాష్ట్ర నిర్మాణ బాధ్యతల్ని భుజానికెత్తుకున్న చంద్రబాబు –సమాజంలోని అన్నివర్గాలకు సమున్నత జీవన ప్రమాణాలు నెలకొల్పడానికి చేసిన అవిశ్రాంత కృషి దక్కిన గౌరవం భారతీయ ఛాత్ర సంసద్ పురస్కారం. ప్రపంచ ప్రసిద్ధి పొందిన షికాగో స్టేట్ యూనివర్శిటీ చంద్రబాబుకు గౌరవ డాక్టరేట్ అందించింది. 'గుడ్ గవర్నెన్స్‌కు ప్రతీక చంద్రబాబు. ప్రజా జీవితంలో యువతకు ఆదర్శవాది. ఆయన రాజకీయ జీవితం భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరచింది' అంటూ అవార్డును అందించిన భారతీయ ఛాత్ర సంసద్ కొనియాడింది. 1867లో యూనివర్శిటీ స్థాపించిన తరువాత ఒక విదేశీ రాజకీయ నాయకుడికి ప్రతిష్టాత్మక పురస్కారం ప్రకటించడం అదే ప్రథమం. దార్శనికత, అసాధారణమైన ప్రతిభా సామర్థ్యాలు, సంస్కరణా దృక్పథమున్న చంద్రబాబుకు డాక్టరేట్ ప్రకటిస్తున్నట్టు షికాగో వర్శిటీ ప్రకటించుకుంది. కొత్తతరం అవసరాలను దృష్టిలో వుంచుకొని చంద్రబాబు తనదైన విజన్‌తో రేపటి ప్రపంచాన్ని సృష్టిస్తున్నారని నెదర్లాండ్ రాయబారి ఆల్ఫోన్సస్ స్టొలింగ్ చేసిన ప్రశంస –చంద్రబాబు స్థాయిని తెలియజేసే అతి చిన్న వ్యాఖ్య. గతంలో కూడా చంద్రబాబు ఐటీ ఇండియన్ ఆఫ్ ద మిలీనియం (ఇండియా టుడే), బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ (ఎకనామిక్ టైమ్స్), ఎకనామిక్ ఫోరమ్స్ డ్రీమ్ కేబినెట్ సౌత్ ఏషియన్ ఆఫ్ ద ఇయర్ (టైమ్స్ ఆసియా) అవార్డులు పొందారు. విపత్తులు ఎదురయినప్పుడు సమర్థంగా ఎదుర్కోవడంలో చంద్రబాబును మించినవారు లేరని తమిళనాడు పత్రికలు ప్రశంసలు కురిపించాయి. జూనియర్ వికటన్, నక్కీరన్ పత్రికలు చంద్రబాబును మెచ్చుకుంటూ ఏకంగా పతాక కథనాలు ప్రచురించాయి. జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ నాయకులతో శభాష్ అనిపించుకొన్న గొప్ప నాయకుడు చంద్రబాబు. 2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత.. జగన్ హయాంలో ధ్వంసమైన ఏపీని కేంద్ర ప్రభుత్వ సహకారంతో అత్యద్భుత పునర్నిర్మాణానికి అహర్నిశలూ శ్రమిస్తున్నారు విజనరీ లీడర్ చంద్రబాబు. 47ఏళ్ళ నాడు శాసనసభ్యుడుగా ప్రమాణం చేసి చట్టసభలోకి అడుగుపెట్టి జాతికోసం, ప్రగతికోసం నిరంతరం తపిస్తున్న, శ్రమిస్తున్న మహా నాయకుడు చంద్రబాబుకు రాష్ట్ర ప్రజల తరఫున అభినందనలు, శుభాకాంక్షలు.

**- నీరుకొండ ప్రసాద్**

---

# సచివులకు ఆటవిడుపు

- **స్పీకర్ అయ్యన్నపాత్రుడి నేతృత్వంలో**
- **క్రీడలు, సాంస్కృతిక పోటీలకు సన్నాహాలు**
- **బెరంపార్కులో భారీగా ఏర్పాట్లు**
- **పరిసరాలను పరిశీలించిన ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని**



అమరావతి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా, ఈ నెల 21వ తేదీన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మానసిక ఉల్లాసానికీ, ఆట పాటలకు విజయవాడ బరంపార్క్ వేదిక కానుంది. శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ విశేష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బరంపార్క్ పరిసరాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్లిప్తంగా మారిన ఈ ప్రాంతాన్ని కొత్త సొబగులతో తీర్చిదిద్దేందుకు, పారిశుద్ధ్య పనులు, వ్యర్థాల తొలగింపు, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవాడ నగర పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బరం పార్కులో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి ప్రణాళికలు అమలు చేసేందుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న హైటెన్షన్ టవర్‌ను మరో ప్రదేశానికి తరలించేందుకు విద్యుత్ శాఖ మంత్రితో ఫోన్లో మాట్లాడారు. త్వరలో విద్యుత్ శాఖ అధికారులు, ఏపీటీడీసీ ఇంజినీరింగ్ విభాగం, చీఫ్ ఇంజినీర్ సంయుక్తంగా ఈ మార్పుపై అధ్యయనం చేయనున్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీటీడీసీ చైర్మన్‌తో పాటు టూరిజం ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బరంపార్క్ అభివృద్ధికి మాత్రమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ టూరిజం ప్రమోషన్‌కు సువర్ణావకాశంగా మారనుంది.

చైతన్యరథం

# ఓడినా అడుగు ముందుకే వేశాం

- గెలుపును అందుకున్నాం
- సప్త సిద్ధాంత సారమే జనసేన విజయం
- యువతతోనే భవిష్యత్తుకు దిశా నిర్దేశం
- సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది
- గుండె ధైర్యమే నాకు రక్షణ కవచం



పిఠాపురం, (చైతన్యరథం): ఇది కీలక సమయం. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాం. ఓటములను చవిచూశాం. అయినా అందరి అభిమానాన్ని చూరగొన్నాం. ఇచ్చి పుచ్చుకునే స్థాయికి ఎదిగాం. మనం నిలబడ్డాం. పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల తెలుదేశం పార్టీని నిలబెట్టాం. భారతీయ జనతాపార్టీకి ప్రీతిపాత్రంగా ఉన్నాం. ఇక్కడి దాకా ఎదగడానికి 11 ఏళ్లు పట్టింది. ఓటమి ఎదురైనపుడు ఎదురొచ్చి మీసాలు మెలేశారు. అవమానించారు. జబ్బలు చరిచారు. ప్రజలను వేధించారు. ఆడపడుచులను ఆరళ్లకు గురి చేశారు. న్యాయం కోసం నిలదీసిన వీరమహిళలను కేసులు బనాయించి జైళ్లలో పెట్టారు. నాలుగు దశాబ్దాల అనుభవశాలి చంద్రబాబును జైలుకు పంపారు. మద్దతుగా నిలబడినందుకు నాపై మరింత రెచ్చిపోయారు. అసెంబ్లీ గేటు తాకనివ్వనన్నారు. నన్ను వ్యక్తిగతంగా కూడా అణిచి వేసేందుకు కుట్ర చేశారు. ఏడాది కాలం దృష్టి సారించాం. అధికార మదంతో విర్రవీగిన అధికార పార్టీని 11 సీట్లకు పరిమితం చేశాం. 21 ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరితో లోక్‌సభలో అడుగుపెట్టాం. దేశమంతా దృష్టిసారించే విధంగా విజయాన్ని అందుకున్నాం. రాష్ట్రంలో, దేశంలో క్రియా శీలకంగా మారాం. ఇక నుండి లక్ష్య సాధన వైపు నడుద్దాం. ఇప్పటి వరకు నడిచింది వేరు. ఇక నుండి వేరు అని గుర్తుంచుకోండి అని జన సేన అధినేత పవన్ కళ్యాణ పేర్కొన్నారు. తనకు వ్యక్తిగతంగా మొట్టమొదటి గెలుపును అందించిన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన పార్టీ ఆవిర్భావ సభలో ఆయన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్‌పై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. పార్టీ పెట్టాలంటే నాన్న సీఎం అయ్యుండాలా.. బాబాయిని చంపించి ఉండాలా.. అలా అని ఎక్కడా రాసి లేదు కదా.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దశాబ్దం పాటు పార్టీని నపడాలంటే ఎన్ని తిట్లు తినాలి.. వ్యక్తిగత జీవితం నుంచి ఆరోగ్యం వరకు ఎన్నో పోగొట్టున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో మూడు గ్రానైట్ రాళ్ళు పెట్టి పగులకొట్టించుకున్న తాను, ఇప్పుడు తన రెండో కొడుకుని ఎత్తుకోలేనంత బలహీనపడ్డానని తెలిపారు. ప్రజలందరి ఆశీర్వాదంతో మళ్లీ బలం తెచ్చుకుంటానన్నారు. రాజకీయాల్లో పవర్ కోసం పని చేయాలి.. లేదా బలమైన సైద్ధాంతికంగానైనా ఉండాలని అన్నారు. పవర్ కోసం మర్డర్లు చేయిస్తాం.. వేల కోట్లు దోచేస్తాం.. కులాలను కెలికేస్తాం.. రకరకాలుగా లాభపడతాం, కోడి కత్తిని వాడుకుంటాం.. అంటే నడవదన్నారు. అలాంటి వాటిని తాను ఎంచుకోలేదని పరోక్షంగా వైఎస్ జగన్‌కు చురకలు వేశారు. తాను సైద్ధాంతిక రాజకీయాలను ఎంచుకున్నానని.. అందుకే దేశ భద్రత కోసం ఆలోచిస్తానని పవన్ పేర్కొన్నారు. రిజిస్టర్డ్ పార్టీ నుంచి రికగ్నైజ్డ్ పార్టీగా జనసేన ఎదిగిందని చెప్పారు. ఎలా మార్చేసుకుంటావని ఏదో మాట్లాడేస్తుంటారని ప్రత్యర్థుల మాటను పవన్ ఉటంకించారు. తాను సమాజంలో మర్పు కోసం పని చేయాలని వచ్చినవాడినని, ఓట్ల కోసం వచ్చిన వాడిని కాదని స్పష్టం చేశారు. ఇన్ని మాట్లాడే ఇంగ్లీష్ పేపర్ వాళ్లు ఒకసారి ఆలోచన చేసుకోండని జాతీయ మీడియాకు పవన్ కల్యాణ్ చురకలంటించారు. ఎంతో ఆలోచించి పార్టీకి సిద్ధాంతాలను రూపొందించాం. సినీమాల్లోనూ దేశభక్తి ఉండాలని తపించేవాడిని సమాజంపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా అని విమర్శకులను ప్రశ్నించారు. దశాబ్దం పాటు పార్టీని నడిపానంటే వ్యక్తగత జీవితం నుండి ఆరోగ్యం వరకు ఎంతో కోల్పోయా.. అయినా పిఠాపురంతో పాటు పార్టీకి దక్కిన సంపూర్ణ విజయం కొత్త ఊపిరినిచ్చింది. సమాజంలో మార్పు కోసం వచ్చా, ఓట్లకోసం కాదని పేర్కొన్నారు. భిన్నమైన వ్యక్తుల్లో ఏకత్వ చూడగలగడమే నా ఐడియాలజీ అని వివరించారు. బలమైన దేశం కావాలంటే ప్రజాబలం ఉండాలి. యువ నాయకత్వం బలపడాలి. సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది. ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన అసవసరం లేదని స్పష్టం చేశారు. భయం లేదు కాబట్టే ఇంత దూరం. వచ్చా. గుండె ధైర్యమే నాకు రక్షణ కవచం అంటూ పవన్ కళ్యాణ్ తన ప్రసంగాన్ని ఉద్వేగభరితంగా కొనసాగించారు. నేను రాజకీయాల్లోకి రావడానికి సినిమా ఉపకరణం మాత్రమే. ఖుషీ సినిమా చూసి గద్దరన్న నన్ను ప్రోత్సహించారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి నాయుడు నన్ను ఎంతో ప్రభావితం చేశారు. సగటు మధ్య తరగతి మనిషిగా బతకాలనేదే నా కోరిక. చంటి సినీమాలో మీనాను పెంచినట్లు నన్ను పెంచారు. అలాంటి నేను సినీమాలు చేస్తానని, రాజకీయాల్లోకి వస్తానని ఊహించి ఉండరు. డిగ్రీ పూర్తి చేసి ఎస్సై కావాలని మా నాన్న అనేవారు. బయటకు వెళ్తే నేనేమౌతానో అని వారికి నిత్యం భయం అని పవన్ చెప్పుకొచ్చారు.



## అమరావతికి ప్రధాని మోదీ

### ముహూర్తం నిర్ణయించనున్న రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి(చైతన్య రథం): రాజధాని అమరావతి పునర్నిర్మాణాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.రాజధానిలో నవనగరాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాని మోదీ చేతులమీదుగా చేయించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏప్రిల్ 15నుంచి 20 తేదీల మధ్య అమరావతికి ప్రధాని వచ్చే అవకాశముంది. తొలి దశలో రాజధానిలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64,721 కోట్లు వెచ్చించనుంది. రూ.37,702 కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది. నిర్మాణ పనులను మిషన్ మోడ్‌లో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈనెల 17న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తర్వాత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అగ్రిమెంట్ లెటర్లు జారీ చేయనుంది. వర్క్ ఆర్డర్లు జారీ కాగానే ఏజెన్సీలు పనులను ప్రారంభించనున్నాయి.

# క్రీడారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- త్వరలోనే అందుబాటులోకి క్రీడా మైదానాలు
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



తిరుపతి, (చైతన్యరథం): తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లవానిగుంట క్రికెట్ మైదానాన్ని, జరుగుతున్న అభివృద్ధి పనులను శాప్ చైర్మన్ రవి నాయుడు, మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని ఆటోనగర్‌లో స్మార్ట్ సిటీలో భాగంగా గొల్లవానిగుంట క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడా, విద్య, వైద్య టూరిజం ఇతర రంగాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా కొత్తగా వివిధ కార్యక్రమాలు శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతిని క్రీడలు, సంస్కృతిక, టూరిజం హబ్‌లుగా మార్చాలని ముఖ్యమంత్రి తృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. వారి ఆదేశానుసారం ఇప్పటికే శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ చొరవతో దాదాపు 80 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. గొల్లవాని గుంట క్రీడా మైదానం అందుబాటులోకి వస్తే జిల్లా నుండి ఎంతో మంది క్రీడాకారులను తయారు చేయవచ్చు అన్నారు. ఈ మైదానంలోనే స్థానికుల కోసం కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి ఇతర క్రీడల కోసం ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తీసుకొస్తున్నామన్నారు. క్రికెట్ ఆటకు పిచ్‌ను సిద్ధం చేస్తామని, త్వరలోనే ఈ మైదానాన్ని సంపూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ మైదానం పనులు దాదాపు పూర్తయ్యాయని ప్రమాణాల ప్రకారం సీటింగ్ సామర్థ్యంతో పెవిలియన్ సభ్యుల సీటింగ్ సామర్థ్యంతో గ్యాలరీ పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అన్ని ప్రాజెక్టుల మొత్తం విలువ రూ. 6 కోట్ల రూపాయలని, అందులో పూర్తయిన పనుల విలువ సుమారుగా రూ. 4.5 కోట్లని తెలిపారు. ఇంకా రూ. 1.5 కోట్ల రూపాయల పనులు పూర్తి చేయాల్సి ఉందని, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం అదనంగా శాప్ నుండి రూ. 2 కోట్లు నిధులను మంజూరు చేస్తామని శాప్ చెర్మన్ తెలిపారన్నారు. మన రూరల్ స్పోర్ట్స్ అయిన కబడ్డీ, కోకో వాలీబాల్ వంటివి ఇందులో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రికెట్ పిచ్‌లను ఈ నెలలోనే అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిగిలిన పనులు సకాలంలో పూర్తిచేసి శాప్ అథారిటీ వారికి అప్పగించడం జరుగుతుందని తెలిపారు. దాని నుండి వచ్చే ఆదాయాన్ని దాని అభివృద్ధి పనులకు, స్టేడియం నిర్వహనకు ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ డ్రై స్టోన్ పిచింగ్, వాకింగ్ ట్రాక్, బండ్ లైటింగ్, రైలింగ్, బండ్ లైటింగ్ మరియు హార్టికల్చర్ అభివృద్ధి పనులు, 3 పిచ్‌లతో కూడిన క్రికెట్ మైదానం, హై మాస్ట్ లైటింగ్, గడ్డి టర్ఫింగ్, డ్రెయిన్లు, పెవిలియన్ తదితర పనులు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ స్మార్ట్ సిటీలో భాగంగా ఈ క్రికెట్ మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నామని, నగర వాసులకు అనుకూలమైన ప్రదేశం అని, ఈ మైదానం నగర నడిబొడ్డున ఉన్నందున క్రీడా ప్రియులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అతి త్వరలో పనులు పూర్తి చేసి స్పోర్ట్స్ అథారిటీ వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నర్సింహ యాదవ్, తిరుపతి నగరపాలక సంస్థ ఎస్ఈ సురేంద్ర, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, స్పోర్ట్స్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నృసింహస్వామి కల్యాణోత్సవం విజయవంతం చేస్తాం

### : టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్యరథం): సింహాచలం శ్రీ వరహా నృసింహస్వామి వారి కల్యాణోత్సవం, చందనోత్సవ పర్వదినాలు విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఈ పండుగల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి అంకురార్పణ చేసే డోలోత్సవంలో శుక్రవారం పాల్గొన్న ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. పవిత్ర హెూలీ రోజున స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఏప్రిల్ 8 న జరిగే కళ్యాణోత్సవం, 30 న జరిగే చందనోత్సవం భక్తులకు మధుర స్మృతిగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. స్వామి వారి సన్నిధిలో జరిగే అన్ని కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాక్షించారు. రూ.54 కోట్లతో జరుగుతున్న ప్రసాద్ స్కీం పనులు చందనోత్సవం సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కొండ దిగువన పుష్కరిణీ మండపంలో జరిగిన స్వామివారి డోలోత్సవంలో పాల్గొన్న గంటా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఏఈఓ ఎన్. ఆనంద్ కుమార్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కార్పొరేటర్ పి.వి.నరసింహం, పార్టీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలం అప్పన్నకు పెళ్లిచూపులు



సింహాచలం (చైతన్యరథం): విశాఖపట్నం జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అప్పన్న స్వామి పెళ్లి చూపులు ఉత్సవం, డోలోత్సవం సంప్రదాయ బద్ధంగా జరిగాయి. అర్చకులు స్వామి, అమ్మవార్లను సింహగిరి పైనుంచి మెట్ల మార్గంలో కొండ దిగువకు తీసుకొచ్చారు. పుష్కరిణి ఉద్యాన మండపంలో దేవతామూర్తులను ఉయ్యాలలో అధిష్ఠించి చూర్ణోత్సవం, వసంతోత్సవం, ఉయ్యాల సేవలు నిర్వహించారు. అప్పన్న స్వామి సోదరి, పైడితల్లి అమ్మవారి కుమార్తెతో స్వామికి పెళ్లి కుదిరిన సందర్భంగా అర్చకులు, గ్రామస్థులు ఆనందోత్సాహాల నడుమ రంగులు చల్లుకొని వేడుకలు నిర్వహించారు. డోలోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామ తిరువీధి మహోత్సవం కనుల పండువగా సాగింది. ఏప్రిల్ 8న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవం, రథోత్సవం వైభవంగా జరగనున్నాయి.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహం



రాజానగరం (చైతన్యరథం): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనుప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీవాణి ధర రామన్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, విశాఖపట్నంలోని ఎమ్మెస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వ్యవస్థాపక అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రోచాన్సలర్ కె.విజయభాస్కర్‌రాజు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభకు జీఎం రామన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మార్కెటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలు స్థాపించి, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకోవాలన్నారు. పా రిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు భవి ష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విధాన కార్యక్రమాలను రూపొందించిందన్నారు. విశాఖలోని భారత ప్రభుత్వ ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏఐసీటీఈ కోర్సుల ప్రిన్సిపాల్, కీలక రిసోర్స్‌పర్సన్ ఆచార్య కె.మురళీకృష్ణ మాట్లాడుతూ భావి పారిశ్రామికవేత్తల కోసం ప్రపంచ స్థాయి వనరులను విశాఖపట్నంలో దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం అందుబా టులోకి తెచ్చిందన్నారు. యువత శిక్షణ పొంద డంతో పాటు ప్రాజెక్టులు కొలాబరేషన్స్ వం టివి వీటి ద్వారా చేసుకోవచ్చని చెప్పారు. కార్య క్రమంలో జీజీయూ ప్రిన్సిపాల్ టి.జయానందకు మార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడు వాడవాడలా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర... ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలి

- యాప్‌లో కార్యక్రమం వివరాలు నమోదు చేయండి : కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు



పార్వతీపురం, చైతన్యరథం): జిల్లాలో శనివారం ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో కార్యక్రమాల వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్లకు సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రీసర్వే పక్కాగా జరగాలని, దీన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న గృహనిర్మాణాల్లో పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పీఎంఏవై 1.0 కింద ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సాయం అందిస్తుందన్న విషయం లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభలో వచ్చిన విజ్ఞప్తులపై మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మ్యుటేషన్, అడంగల్ వంటి సమస్యలపై తదితర వాటిపై తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్ఆర్ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

**23 నాటికి గృహ నిర్మాణాల సర్వే పూర్తి చేయాలి**

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల సర్వేని మార్చి 23వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. వివిధ శాఖల ప్రగతిని కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 20వ తేదీ నాటికి మొదటి దశ పూర్తి చేస్తే 21వ తేదీ నాటికి వారిఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

- 107 కేంద్రాలు, 21 వేల మంది విద్యార్థులు
- ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



అనకాపల్లి కలెక్టరేట్, (చైతన్యరథం): వచ్చే సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు 107 సెంటర్లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి సుమారు 21 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా శాఖ అధికారులకు సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలో వున్న జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణను తనిఖీ చేయడానికి సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిళ్లను వ్యాల్యుయేష్ కేంద్రానికి సకాలంలో పంపించడానికి పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని కలెక్టర్ తెలిపారు. ఎక్కడా కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల సహాయ కమిషనర్ శ్రీధర్, వైద్య, ఆర్యోగ, పోలీసు, ఈపీడీసీఎల్, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ స్కాలర్‌షిప్ పరీక్ష... 2025కు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి (చైతన్యరథం): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అనుబంధ సంస్థ అయిన ఎక్సెల్ సివిల్స్ అకాడమీ.. యూపీఎస్సీ మెరిట్ స్కాలర్‌షిప్ 2025 పరీక్ష నిర్వహించనుంది. ఈ మేరకు ఎక్సెల్ సివిల్స్ అకాడమీ డైరెక్టర్ కె రాజేంద్ర కుమార్ తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులకు ఈ పరీక్ష మార్చి 23న హైదరాబాద్, విజయవాడలోని పరీక్షా కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులకు 23వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు రాత పరీక్ష నిర్వహిస్తారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లోని ఎక్సెల్ సివిల్స్ అకాడమీ కేంద్రం, విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కేంద్రంలో ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు కోర్సు ఫీజులో 75 శాతం వరకు తగ్గింపు పొందే అవకాశం ఉంది. ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణతతోపాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎవరైనా ఈ పరీక్ష రాయొచ్చు. ఈ అర్హతలున్న విద్యార్థులు మార్చి 20, 2025వ తేదీలోపు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే.. ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చని డైరెక్టర్ కె రాజేంద్ర కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలకు 9100433442, 9100433445 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొస్తాం : నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): గత ప్రభుత్వం వైద్యారంగాన్ని నిర్వీర్యం చేసి, నిరుపేదలు ఆరోగ్యానికి తూట్లు పొడిచారని, నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వం ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డయాలసిస్ కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమంశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, ఏపీ స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ సంయుక్తంగా ప్రారంభించారు. వంద పడకల హాస్పిటల్, పాత హాస్పిటల్‌ను పరిశీలించారు. డయాలసిస్ ఆసుపత్రి నందు అన్ని విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సహాయాలపై వైద్యులను ఆరా తీశారు.డయాలసిస్ పేషంట్లుతో మాట్లాడి వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... నేడు పాలకొల్లు నియోజకవర్గానికి రావడం, డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాలకొల్లు అభివృద్ధి పనులు రాష్ట్రవ్యాప్తంగా అనుసరణీయం అన్నారు. వంద పడకల హాస్పిటల్‌ను పూర్తి చేసి ప్రారంభించుటకు, రానున్న రెండు ఏళ్ళలో పాలకొల్లుకు మెడికల్ కాలేజి ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మీ ఆసుపత్రిని చూస్తుంటే నిరుపేదల ఆశ్రమంగా అద్భుతంగా ఉందని, ఈ గొప్పతనం మీ మంత్రి రామానాయుడుదే అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా రానున్న ఐదు సంవత్సరాలలో వైద్య రంగంలో అనేక వినూత్న మార్పులను తీసుకువచ్చే దిశగా కార్యాచరణను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే క్యాన్సర్, కిడ్నీ, డయాబెటిస్, హైపర్ టెన్షన్ తదితర సర్వేలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించగా, నేడు ఎన్డీయే సర్కారు పునర్జీవం పోసిందన్నారు. చంద్రబాబు నిరుపేద వర్గాలకు అన్ని రకాల వైద్య అందేలా రాష్ట్ర బడ్జెట్లో రూ.19,264 కోట్లను కేటాయించిందని, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు మంచి నాణ్యమైన, ఉచిత వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిలిపివేసిన ఎన్టీఆర్ వైద్య సేవ, ఎన్టీఆర్ బేబీ కిట్స్‌ను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని అన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలకు ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన రెండు వేల కోట్ల బకాయిల్లో ఇప్పటికే 1300 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో అమరావతి రాజధాని, పోలవరం వంటి ప్రాజెక్టులే కాదు, వైద్య రంగాన్ని పూర్తిగా విధ్వంసానికి గురిచేసిందని తెలిపారు.

ఏపి స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మాట్లాడుతూ... అధ్యాపక వృత్తిలో ఒకరు, సామాన్య కార్యకర్త నుండి ఒకరు ఇద్దరు నాయకులు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. స్వయం కృషితో రాజకీయంగా ఎదిగిన వ్యక్తులుగా, మచ్చలేని నాయకులుగా పేరు పొందిన మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్య కుమార్‌లతో వేదిక పంచుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కోవిడ్ సమయంలో ఆసుపత్రులు ఎలా పని చేశాయో మీరంతా గుర్తు చేసుకోవాలని, తిరుపతి రుయా హాస్పిటల్‌లో 30 మంది ఆక్సిజన్ దొరక చనిపోయారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 25 లక్షల రూపాయలతో యూనివర్సల్ హెల్త్ స్కీమ్ తీసుకు వస్తున్నామని దీనివలన ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఆరోగ్య భీమా లభిస్తుందన్నారు.

## మండిపోతున్న భాస్కరుడు... మాడు పగిలేలా ఎండలు



భాస్కరుడు బెంబేలెత్తిస్తున్నాడు... బయటకొచ్చారా మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు. కాదుకూడదని బయట అడుగుపెడితే సుర్రు సుమ్మైపోద్దంటూ ఉదయం తొమ్మిది గంటల నుంచే చుక్కలు చూపిస్తున్నాడు. సాయంత్రమైనా భూమి సెగలు పొగలు కక్కుతూనే ఉంది. మే నెల వచ్చిందా? అని చూస్తే, క్యాలెండర్ మార్చి కూడా దాటలేదు. ఫిబ్రవరి నుంచి మొదటి నుంచే ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఇక ఈ నెల మొదటి వారం నుంచే వేడి పెరుగుతోంది. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడే ఈ రేంజ్ లో ఎండలు ముదిరితే.. ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తెలుగు రాష్ట్రాలు నిప్పుల గుండంగా మారిపోయాయి. తెలంగాణలో మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతోపాటు వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ జిల్లాల్లో ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉంది.

తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ముఖ్యంగా కేరళలో అతినీలలోహిత కిరణాలు తీవ్రత తీవ్రరూపం దాల్చాయి. వాతావరణ కాలుష్యం, ఓజోను పొరకు రంధ్రాలు తదితర కారణాలతో యూవీ ఇండెక్స్ 'అత్యంత ప్రమాదకర కేటగిరీ'లోకి చేరింది. దీంతో కేరళలోని పలు జిల్లాలో ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆ జిల్లాలో



అతినీలలోహిత కిరణాలు అధికస్థాయిలో ఉన్నట్లు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. పలు ప్రాంతాల్లో ఇది 11 పాయింట్లుగా నమోదైంది. '11' దాటితే అత్యంత ప్రమాదకర కేటగిరీలోకి చేరినట్లు లెక్క. యూవీ కిరణాల తీవ్రత పెరిగే కొద్దీ ఓజోన్ పొర మందం తగ్గుతుంది. మనుషుల్లో చర్మ సంబంధిత సమస్యలు, కళ్ల రుగ్మతలకు కారణమవుతాయి. చర్మ క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అతినీలలోహిత కిరణాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దీని ప్రభావం ఉంటుందని తెలిపింది. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, మత్స్యకారులు, వాహనదారులు, పర్యాటకులు, చర్మ, కంటి సంబంధిత సమస్యలతో బాధపడేవారు నేరుగా అతినీలలోహిత కిరణాల బారినపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి వెళ్లేటప్పుడు నూలు దుస్తులు, గొడుగులు, టోపీలు, కంటి అద్దాలు వంటివి ధరించాలని సూచించింది.

## వెనకడుగు వేయలేదు - అన్నీ ఒక్కడినై పోరాటం చేశా: పవన్‌కల్యాణ్




పిఠాపురం (చైతన్యరథం): ఓడినా అడుగు ముందుకే వేశామని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో ఏర్పాటు చేసిన "జయ కేతనం" సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తన ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా వెనకడుగు వేయలేదని చెప్పారు. అన్నీ ఒక్కడినై పోరాటం చేశానని, మనం నిలబడి పార్టీని నిలబెట్టామని అన్నారు. మనం ఓడినప్పుడు మీసాలు మెలేశారని, జబ్బలు చరిచారన్న పవన్, తామే నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టామని తెలిపారు. మన కార్యకర్తలను, వీరమహిళలను అనేక బాధలు పెట్టారని, తనను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారని పేర్కొన్నారు. అసెంబ్లీ గేటును తాకనివ్వం అని ఛాలెంజ్ చేశారని, వాళ్ల ఛాలెంజ్‌లు సవాలుగా తీసుకుని పోరాడామని గుర్తు చేశారు. దేశమంతా మనవైపు చూసేలా వందశాతం స్ట్రైక్‌రేట్‌తో విజయం సాధించామని చెప్పారు. దాశరథి సాహిత్యం చదివి ప్రభావితం అయ్యానని వెల్లడించారు. రుద్రవీణ వాయిస్తా, అగ్నిధారలు కురిపిస్తా అనే మాటలు నిజం చేశామని పవన్ కల్యాణ్ అన్నారు.

దాష్టీక ప్రభుత్వాన్ని దించి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని తెలిపారు. జనసేన జన్మస్థలం తెలంగాణ, కర్మస్థానం ఆంధ్రప్రదేశ్ అని పవన్ పేర్కొన్నారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని పవన్ కల్యాణ్ అన్నారు. కరెంట్‌షాక్ కొట్టి చావుబతుకుల్లో ఉంటే కొండగట్టు అంజన్న ప్రాణం పోశాడని చెప్పుకొచ్చారు. జనసేన వీరమహిళలు రాణిరుద్రమలు అని, తేడా వస్తే కాల్చి ఖతం చేసే లేజర్ బీమ్‌లని పవన్ కల్యాణ్ కొనియాడారు. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకలోనూ రాజకీయపరంగా జనసేనకు అభిమానులున్నారన్న పవన్, తమిళులు తన తెలుగు ప్రసంగాలు వింటున్నారని తెలిసిందన్నారు. తమిళులు తనపై చూపుతున్న ప్రేమకు కృతజ్ఞుడిని అని అన్నారు. ఈ సందర్భంగా హిందీ, తమిళం, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో పవన్ కల్యాణ్ ప్రసంగించారు.

**గద్దర్ అన్నకు నివాళులు:** అనేక ఇబ్బందులు పడి 11 ఏళ్లుగా పార్టీని నడిపానన్న పవన్ కల్యాణ్, తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు సినిమా సాధనం మాత్రమేనని చెప్పారు. ఖుషి సినిమా చూసి గద్దర్ తనను ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా గజ్జెకట్టి ప్రజలను ప్రభావితం చేసిన గద్దర్ అన్నకు నివాళులు అంటూ పేర్కొన్నారు. సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు తనను ఎంతో ప్రభావితం చేశారని తెలిపారు.

## మార్చి 15న అమరావతిలో శ్రీనివాస కళ్యాణం

- శ్రీవారి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి పరిధిలోని వెంకటపాలెంలో గల శ్రీవారి ఆలయంలో ఈ నెల 15వ తేదీన శ్రీనివాస కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. అ ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కానున్నారు. కాగా, శుక్రవారం నాడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు వెంకటపాలెంలో గల శ్రీవారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2018లో నారా చంద్రబాబు ఈ ఆలయ నిర్మాణానికి వెంకటపాలెంలో 25 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, 2019లో శంకుస్థాపన చేశారని దేవినేని ఉమా గుర్తు చేసారు. శ్రీనివాస కల్యాణంపై అమరావతి గ్రామాల్లో టీటీడీ ప్రచారం రథం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తోన్నట్లు చెప్పారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాలలో అవసరమైన గ్యాలరీలు, క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు సులభతరంగా స్వామివారిని దర్శించుకునేలా తితిదే ఏర్పాట్లు చేస్తోన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీనివాస కళ్యాణోత్సవం అనంతరం అమరావతి పనుల పునర్నిర్మాణానికి అంకురార్పణ చేస్తారన్నారు.

# విభిన్న ప్రతిభావంతులందరికీ ఉపకరణాలు అందజేస్తాం

● ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): గత ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పట్టించుకోలేదని, గత మూడేళ్లుగా ఎంపిక చేసిన వారికి ఉపకరణాల పంపిణీ చేయకుండా నిర్లక్ష్య వైఖరితో గత ప్రభుత్వం వ్యవహరించిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా విభిన్న ప్రతిభావంతులకు కావాల్సిన ఉపకరణాల గుర్తింపు కేంద్ర ప్రభుత్వం 2022లోనే ఎంపిక పూర్తి చేయటం జరిగిందని, కానీ వాటిని ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో సహకారంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్, ట్రై సైకిల్, కృత్రిమ అవయవాలు పంపణీ కార్యక్రమం శుక్రవారం మొఘల్ రాజపురంలోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ, విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు పాల్గొన్నారు. విజయవాడ పట్టణంలోని మూడు నియోజకవర్గాలకు చెందిన 715 మంది విభిన్న ప్రతిభావంతులకి అవసరమైన బ్యాటరీ నడిచే ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, చంక కర్రలు, చెవిటి మిషన్లు, కృతిమ అవయవాలు, క్యాలిపర్స్ వంటి ఉపకరణాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో 140 మందికి బ్యాటరీ నడిచే మూడు చక్రముల బండ్లు, 121 మంది మూడు చక్రముల సైకిళ్లు, 8 మందికి సి.పి చైర్లు, 71 మందికి వీల్ చైర్లు, 87 మందికి చంక కర్రలు, 128 మంది వినికిడి యంత్రాలు, 29 మందికి ఏం.ఎస్.ఐ.డి కిట్లు, 20 మందికి రోలేటర్లు, 20 మందికి చేతి కర్రలు, మరో91 మందికి వారికి అవసరమైన ఉపకరణాలు ఇలా దాదాపు రూ.1.4 కోట్ల విలువ చేసే ఉపకరణాలు ఉచితంగా అందజేశారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... విభన్న ప్రతిభావంతులకు వారి అవసరాలకు సరిపడా ఉపకరణాలు అందించటం చాలా సంతోషంగా ఉందన్నారు. కేంద్రం 2022లో విభన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు ఉచితంగా ఇవ్వాలని జాబితా తయారుచేస్తే గత ప్రభుత్వం దీన్ని పట్టించుకున్న దాఖాలలు లేవన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే విజయవాడ ఎంపీగా తాను జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు కృషి చేయటం జరిగిందన్నారు. రెండు నెలల క్రితమే వీటిని హైదరాబాద్ నుంచి తెప్పించటం జరిగింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యం జరిగిందన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే విభన్న ప్రతిభావంతులకు చెప్పినట్లు ఆరు వేల రూపాయలు పెన్షన్‌గా అందజేయడం జరిగిందని, పెన్షన్‌తో పాటు మీ ఆత్మవిశ్వాసం మరింత పెరిగేందుకు అవసరమైన ఉపకరణాలు అందచేస్తున్నారని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో తమ కంటే కలెక్టర్ లక్ష్మీశ రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నిత్యం ప్రజల మధ్య వుంటూ ప్రజల సమస్య పరిష్కారం పనిచేస్తారని పేర్కొన్నారు.

# అభివృద్ధికి గ్రీన్ బుక్... అరాచకాలకు రెడ్‌బుక్ : పెమ్మసాని



మంగళగిరి (చైతన్యరథం): అభివృద్ధికి గ్రీన్‌బుక్... అరాచకాలకు రెడ్‌బుక్ అని, తప్పుడు పనులు చేసిన ఏ ఒక్కరిని నారా లోకేష్ వదిలి పెట్టరని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎర్రబాలెంలోని శ్రీ భగవాన్ మహావీర్ గోశాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు గోశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జైనులు వ్యాపారాన్ని ఒక వరంలా, అహింసని ఒక ధర్మంలా, గో రక్షణను ఒక లక్ష్యంగా చేసుకొని ముందుకు వెళుతుంటారని అన్నారు. జైనుల ఆధ్వర్యంలో ఇక్కడ గోశాల చాలా శుభ్రంగా, అందంగా నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. గోవుల వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, ఆఖరికి వాటి విసర్జన కూడా ఎరువులుగా ప్రకృతికి ఉపయోగపడేదన్నారు. గత ఐదు సంవత్సరాల్లో వ్యాపారస్తులు ఎంతగా ఇబ్బంది పడ్డారో అందరికీ తెలుసు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నారు. సాధారణంగా వైస్ ఛాన్సలర్ పదవులు అంటే డబ్బులు తీసుకుని నియామకాలు చేస్తారు. కానీ ఫస్ట్ టైం అర్హులని, చదువుకున్న వాళ్ళని వెతికి వెతికి మరీ నాగార్జున, ఆంధ్ర యూనివర్సిటీ వంటి ఎన్నో యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో నియామకాలు జరిపిన నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. టీచర్ల యూనియన్లతో పని చేయించడం ఎంత కష్టమో అందరికీ తెలుసు. ఎంతో క్లిష్టమైనటువంటి మంగళగిరి నియోజకవర్గాన్ని ఒంటి చేత్తో ముందుకు తీసుకువచ్చిన లోకేష్‌కి ఈ విద్యా వ్యవస్థను కూడా అదేస్థాయిలో తీసుకెళ్లగల్లడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. అలాంటి ఆ నాయకుడు ఈ నియోజకవర్గానికి ప్రజాప్రతినిధిగా ఉండడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భగవాన్ మహావీర్ గోశాల నిర్వాహక సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యం : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ పట్టణం 22వవార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గురువారం ఉదయం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైలుపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక శిబిరంలో కూటమి శ్రేణులతో కలిసి... ఎమ్మెల్యే రాము ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే పలు సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకున్నారు. అనంతరం ద్విచక్ర వాహనంపై వార్డులో ఎమ్మెల్యే రాము పర్యటిస్తూ... ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల వారీగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు తన దృష్టికి వచ్చిన సమస్యల్లో అత్యధిక సమస్యలను తక్షణమే పరిష్కరించామని, ఆర్థికపరమైన సమస్యలను త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. నిత్యం తన దృష్టికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే రాము చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పునరుద్ఘాటించారు.

# సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట ఓవరం





వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి భట్టిప్రోలు మండలం ఆల్లమూడి గ్రామానికి చెందిన పులి జగదీష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన సిరాందాసు హేమామాలిని, చింతమోటు గ్రామానికి చెందిన ఉయ్యూరు అక్షయ, పెదాపులివర్రు గ్రామానికి చెందిన మల్లిపెద్ది నాగవర్థిని, సూరేపల్లి గ్రామానికి చెందిన వేపూరి శైలజ, ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసం అయిన బిల్‌ని వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపించారు. తదుపరి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కు రూపంలో రూ.3,11,319 మంజూరు చేశారు. మంజూరైన మొత్తాన్ని వారికి, వారి కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో నక్కా ఆనందబాబు అందజేశారు.

# ఏపీలో ఆర్యవైశ్య కార్పొరేషన్ సేవలు భేష్

● తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాత వెల్లడి



విజయవాడ (చైతన్యరథం) : ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ సేవలు భేష్ అని తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత వ్యాఖ్యానించారు. శుక్రవారం విజయవాడ పశ్చిమ నియోజవర్గం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ కార్యాలయాన్ని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత సందర్శించారు. ఏపీలో జరుగుతున్న ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... "ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులు, చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చక్కటి చొరవ చూపుతున్నారు. వాసవిమాత జన్మస్థలం ఆంధ్రప్రదేశ్ కావటం ఆర్యవైశ్యలందరూ చేసుకున్న అదృష్టం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబునాయుడు సారథ్యంలో డూండి రాకేష్ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు జయంతి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా చేయడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీ ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ చేస్తున్న పలు కార్యక్రమాలు అభినందనీయం." అని సుజాత వ్యాఖ్యానించారు. త్వరలో మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ సంక్షేమ కార్యక్రమాలను వివరించి తాము ఒక కార్యాచరణ రూపొందించుకుంటామని అన్నారు.

# టీడీపీ పాలనలో గిరిజన తండాల అభివృద్ధి



వినుకొండ (చైతన్యరథం): గత టీడీపీ పాలనలోనే గిరిజన తండాల అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల సేవాలాల్ సంత్ మహారాజ్ గుడి వద్ద శుక్రవారం జరిగిన హోలీ వేడుకల్లో చీఫ్ విప్‌జీవి పాల్గొన్నారు. సుగాలి సోదరులతో కలిసి హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... 2014-19 టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గిరిజన తండాల్లో ప్రతి వీధికి సీసీ, రోడ్లు డ్రైనేజీ, వీధి లైట్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. బొల్లాపల్లి మండలంలో గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా ఆర్.ఎస్.ఆర్‌కు పైబడిన భూముల్లో ఎంతోమంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి భూమి హక్కు పట్టాలు లేవని, అర్హులైన వారందరినీ గుర్తించి ఆరు నెలల్లో పట్టాలు ఇప్పించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం సూర్యకాంతి పథకం ద్వారా సోలార్ విద్యుత్ సౌకర్యం తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు.

## కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోండి : కందుల నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం) : ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి నియోజకవర్గంలోని మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసే కందుల, సెనగల, మినుముల కేంద్రాలను ప్రారంభించారు. మొదటగా మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కొనకనమిట్ల మండలంలోని నాగరాజు కుంట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. చివరగా పొదిలి పట్టణంలోని వాసవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు వ్యాపారస్తులకు కందులు, మినుములు, శనగలు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వమే మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మార్కెట్ రేటు కంటే ఎక్కువ ధరకు పప్పు ధాన్యాలను కొనుగోలు చేసి నాలుగు రోజుల్లో రైతులు ఎకౌంట్లో డబ్బులు జమ చేస్తారని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులు పట్ల ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, రైతులు, ఆయా విభాగాలు అధికారులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి నియోజకవర్గానికి పట్టిన అష్టదరిద్రం కాకాణే



సర్వేపల్లి (చైతన్యరథం): నియోజకవర్గానికి పట్టిన అష్టదరిద్రం కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని, నోరు అదుపులో పెట్టుకోకపోతే వల్లభనేని, పోసానికి పట్టిన గతే ఖాయమని నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు ద్రోహం చేసినందుకు ఆయనకు డాక్టరేట్ ఇవ్వాల్సిందేనని, కాకాణి వాడుతున్న అసభ్య పదజాలంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... "ప్రజా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై కాకాణి గోవర్ధన్ రెడ్డి వాడుతున్న బజారు భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో దొరికే మొత్తం ఫినాయిల్‌ను తెచ్చి శుభ్రం చేసినా కాకాణి నోటి గబ్బుపోయేలా కనిపించడం లేదని, గోవర్ధన్ రెడ్డి పదేపదే చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు, వాడుతున్న అసభ్య పదజాలంపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామని అన్నారు. ప్రజాస్వామ్యంలో హుందా రాజకీయాలు ఉండాలి కానీ ఓటమి ఫ్రస్టేషన్‌తో నోటికొచ్చినట్టు మాట్లాడటం దుర్మార్గమన్నారు. జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేతో పాటు మంత్రి పదవి వెలగబెట్టిన వ్యక్తి మాట్లాడే భాష ఇదా..అని ప్రజలు ఈసడించుకుంటున్నారని అన్నారు. ఈ మధ్య గోవర్ధన్‌రెడ్డి పేరు ముందు డాక్టర్ అని రాయడం పేపర్లలో చూస్తున్నామని, సాధారణంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి, వివిధ అంశాలపై పరిశోధనలు చేసిన వారికి యూనివర్సిటీలు డాక్టరేట్లు ప్రధానం చేస్తాయని తెలుసుకున్నాం. వావిలేటిపాడులో కోట్లాది రూపాయల విలువైన దళితుల భూములను ఆక్రమించినందుకు, టీడీపీ నాయకుల ఆస్తులను కక్షపూరితంగా విధ్వంసం చేసినందుకు, ఉదయగిరి నారాయణను లాకప్ డెత్ చేసిన ఎస్సైను ప్రోత్సహించినందుకు, దళితులను చంపి తప్పించుకోవడం ఎలా అనే అంశంపైనా కాకాణికి కచ్చితంగా డాక్టరేట్ ఇవ్వాలన్నారు. రాజకీయ ఉద్యమాల్లోకి హిజ్రాలను ఉసిగొల్పిన విషయంలోనూ పొందేందుకు కాకాణి అర్హుడు. నోటికొచ్చినట్టు అడ్డమైన భాషను మాట్లాడుతున్నందుకే వైసీపీ అధిష్టానం ఆయనకు జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినట్టుంది. రాష్ట్రంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి లాంటి నీచుడు, నికృష్టుడు లేడు. వరదాపురం రుస్తుం మైన్‌లో సోమిరెడ్డి చేపట్టిన సత్యాగ్రహ దీక్షలోకి హిజ్రాలను పంపి ఇప్పుడు సిగ్గులేకుండా తనకు సంబంధం లేదంటున్నాడు. భూమికి మూడు అడుగుల ఉండే కాకాణి గోవర్ధన్ రెడ్డి మా నాయకుడి గురించి మాట్లాడటం హాస్యాస్పదం. సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువును గ్రావెల్ కోసం కొల్లగొట్టేశాడు. జగనన్న కాలనీలకు అవినీతిమయంగా మార్చేశాడు. 2014 ఎన్నికల్లో ఓట్ల కోసం గోవా నుంచి కల్తీ మద్యం తెప్పించి ఎందరో అమాయకుల చావుకు కారణమయ్యాడు. సోమిరెడ్డిని తిట్టడంతోనే దినచర్య ప్రారంభించే కాకాణి ఇప్పటికైనా బూతుపురాణానికి స్వస్తి పలకకపోతే త్వరలోనే గూబ పగలడం ఖాయం." అని హెచ్చరించారు.

## నేటి నుంచి ఏపీ, తెలంగాణలో ఒంటిపూట బడులు



అమరావతి (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే ఎండలు మాడు పగలగొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీక్షణంగా కాస్తుంది. ఈ క్రమంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ప్రకటన చేశాయి. స్కూల్ విద్యార్థులకు శనివారం (మార్చి 15) నుంచి ఒంటి పూట బడులు ఇస్తున్నట్లు ప్రకటించాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉదయం 8 గంటల నుంచే బడులు ప్రారంభం కానున్నాయి. ఇక మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు పని చేయనున్నాయి. ఆ తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి పిల్లలను ఇంటికి పంపించేస్తారన్నమాట. అయితే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు మాత్రం సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని విద్యాశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న బడుల్లో మధ్యాహ్నం 1 గంటట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

**ఏపీలో ఒంటిపూట బడులు ఎప్పట్నుంచంటే..**

మరోవైపు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కూడా ఒంటిపూట బడులపై తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో కూడా మార్చి 15 నుంచే ఒంటి పూట బడులు ప్రారంభంకానున్నట్లు ఉత్తర్వుల్లో విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు మార్చి 15 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు ఒంటి పూట బడులు కొనసాగనున్నాయి. దీంతో బడుల పనివేళల్లో కూడా మార్పులు రానున్నాయి. ఉదయం 7.45 గంటల నుంచి 12.30 గంటల వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న బడుల్లో మాత్రం మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఇక ఏప్రిల్ 25వ తేదీ నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయి. తిరిగి పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి.

## నడిరోడ్డుపై నల్లటి బ్యాగ్... అందులో 3.5 లక్షల నగదు !

- **మార్కాపురంలో బైక్‌పై వెళ్తూ బ్యాగ్ జారవిడుచుకున్న వైనం... 24 గంటల్లోనే సొత్తు రికవరీ చేసి పోలీసులు... కృతజ్ఞతలు తెలిపిన బాధితులు**



మార్కాపురం (చైతన్యరథం): సాయంత్రం ఏడున్నర గంటల ప్రాంతం. వీధులన్నీ రద్దీగా ఉన్నాయి. దంపతులిద్దరూ బైక్‌పై వెళుతున్నారు. ఆ హడావుడిలో బైక్‌కు తగిలించిన ఓ బ్యాగ్ జారి కిందపడిపోయింది. బ్యాగు జారిపడిపోయిన విషయాన్ని ఆ సమయంలో దంపతులు గమనించలేదు. కొద్దిదూరం వెళ్లిన తరువాత చూసుకుంటే బ్యాగు కనిపించలేదు. దంపతుల గుండెలు గుభేలుమన్నాయి. ఎందుకంటే బ్యాగులో 3.5 లక్షల నగలు, నగదు ఉన్నాయి. దీంతో లబోదిబోమంటూ ఆ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. రోడ్డుపై రూపాయి పడిపోతేనే తిరిగి దొరకడం కష్టం. అలాంటిది మూడున్నర లక్షలు ఉన్న బ్యాగు తిరిగి లభిస్తుందా..! ఇది సాధ్యమయ్యేనా.. అయితే మార్కాపురం పోలీసులు దీన్ని సాధ్యం చేసి చూపించారు. రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా బ్యాగు ఎక్కడ పడిపోయింది. ఎవరు తీసుకెళ్ళారో కనిపెట్టి మరీ బ్యాగును రికవరీ చేసి శభాష్ అనిపించుకున్నారు. బాధితుల మన్ననలను అందుకున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో నగదు, బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు 24 గంటల వ్యవధిలోని సొత్తును రికవరీ చేసి అందించారు. దోర్నాల మండలం వెన్నా కాశిరెడ్డి, ధనలక్ష్మి దంపతులు వ్యక్తిగత పనులపై మార్కాపురం వచ్చి తిరిగి సాయంత్రం ఏడున్నర గంటల ప్రాంతంలో బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా వారి వద్ద ఉన్న బ్యాగు తూర్పు వీధి సమీపంలో కింద పడిపోయింది. బ్యాగు పడిపోయిన విషయాన్ని గమనించకుండా బైక్‌పై కాశిరెడ్డి దంపతులు కొద్దిదూరం వెళ్ళారు. ఆ తర్వాత చూసుకుంటే బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 2 లక్షల విలువైన బంగారు నగలు, 1.50 లక్షల నగదు ఉన్నాయి. నగలు, నగదు ఉన్న బ్యాగు బైక్‌పై నుంచి జారి పడిపోవడంతో ఏం చేయాలో అర్ధంకాని దంపతులు వెంటనే మార్కాపురం పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా రోడ్డుపై పరిశీలించారు. అదే సమయంలో ఓ మహిళ రోడ్డుపై పడిపోయిన బ్యాగును తీసుకెళ్లిందని గుర్తించారు. సీసీ కెమెరాలో ఉన్న దృశ్యాల ద్వారా ఆ మహిళను గుర్తించి ఆమె నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో ఉన్న మూడున్నర లక్షల విలువైన నగలు, నగదును కాశిరెడ్డి దంపతులకు అప్పగించారు. 24 గంటల వ్యవధిలో తమ బంగారు ఆభరణాలు, నగదును గుర్తించి తిరిగి అప్పగించిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించింది

భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట నారాయణ భట్టి తెలిపారు. చట్టం, మహిళా సాధికారిత అంశంపై తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సాధికారత సాధించడానికి రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు ప్రసాదించిందని ఆయన పేర్కొన్నారు. సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు రాష్ట్రాలకు అధికారం ఇచ్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టి తెలిపారు. సాధికారత ఎగుమతి, దిగుమతి చేసుకొనే సరుకు కాదని మహిళలు తమకు తాముగా సాధించుకోగలరని ఆయన వెల్లడించారు.

## మీ మద్దతుతోనే మాకు మహాయోగం : టీడీపీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు, పట్టణంలోని శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ విద్యా సదస్సులో గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు మేళ తాళాలతో, పూలమాల శాలువాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఉపాధ్యాయులను, ప్రభుత్వ ఉద్యోగులను నట్టేట ముంచారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చగా పోగా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. విద్యా విలీనం పేరుతో గ్రామాల్లోని చిన్నారులకు విద్యను దూరం చేశారన్నారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను ప్రభుత్వ మద్యం షాపుల వద్ద నియమించి వారిని అగౌరవ పరిచారన్నారు. వైసీపీ పాలకుల అరాచక పాలనకు విసుగెత్తిన ప్రభుత్వ ఉద్యోగులు సంఘటితంగా పోరాడి 2024 ఎన్నికల్లో వైసీపీ పాలకులను ఇంటికి సాగనంపారన్నారు. రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ ఎన్డీయే కూటమి విజయంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర అని, వారందరి మద్దతు మరువలేనిదని, ఎన్డీయే కూటమి గెలుపు వారందరికీ అంకితం అన్నారు.. గిద్దలూరు నియోజకవర్గంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గత పాలనలో జరిగిన నష్టాలను అధిగమిస్తామని అన్నారు. విద్యారంగాన్ని ముందంజలో నడిపేందుకు కృషి చేస్తామన్నారు. సభ అనంతరం ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ రెడ్డిని ప్రభుత్వ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పరిటాల వారి ఇంట హోలీ సందడి

- రంగులు చల్లుకుంటూ సందడిగా గడిపిన పరిటాల సునీత, శ్రీరామ్
- ప్రతి కుటుంబంలో సంతోషం, సంబరాలు ఉండాలని ఆకాంక్ష



అనంతపురం (చైతన్యరథం): పరిటాల వారి ఇంట హోలీ పండుగ సందడి కనిపించింది. నిత్యం ప్రజల మధ్య, రాజకీయాలతో బీజీ బీజీగా గడిపే ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ హోలీ పండుగ జరుపుకుంటూ సంతోషంగా గడిపారు. ఉదయం అరవింద్ నగర్ లోని తమ నివాసంలో కుటుంబసభ్యులు, అనుచరులతో కలిసి పండుగ జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఎంతో ఉత్సాహంగా కనిపించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పరిటాల రవీంద్ర, పరిటాల అమైరా రవీంద్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ నానమ్మ అయిన పరిటాల సునీతకు రంగులు చల్లుతూ కేరింతలు కొడుతూ కనిపించారు. సునీత కూడా తన మనవడు, మనవరాలుకు రంగులు చల్లుతూ సంతోషంగా గడిపారు. పరిటాల శ్రీరామ్ కూడా తన చుట్టూ ప్రతి రోజు కనిపించే అనుచరులకు రంగులు చల్లుతూ ఆనందంగా కనిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త రంగులు నింపాలని ఆకాంక్షించారు. 'కామ దహనం' చేసి రంగులు చల్లుకుని, ఆనందం పంచుకుని అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలిపారు.

# హోలీ వేళ మగువ అవతారం ఎత్తిన మగాడు

- కర్నూలు ఆదోనిలో వింత ఆచారం... రతి మన్మధుడికి ప్రత్యేక పూజలు



కర్నూలు (చైతన్యరథం): దేశవ్యాప్తంగా హోలీ సంబరాలు వైభవంగా జరిగాయి. చిన్నా, పెద్దా అంతా కలిసి హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. రంగుల హేలీ హోలీ. కొన్ని చోట్ల డీజే పాటలు పెట్టుకుని రంగులు చల్లుకుంటూ ఆడిపాడుతారు. అయితే హోలీ పండును కొన్ని చోట్ల ఒక్కో రకంగా జరుపుకుంటున్నారు. పలు చోట్ల వింత ఆచారాలు కూడా ఉంటాయి. ఎన్నో ఏళ్ల గా ఉన్న ఆచారాలను పాటిస్తూ ఆయా గ్రామాల్లో హోలీ సంబరాలను జరుపుకుంటారు ప్రజలు. ఇదే విధంగా కర్నూలు జిల్లాలోనూ ఓ వింత ఆచారం ఉంది. ఆ గ్రామంలో రెండు రోజుల పాటు ఈ ఆచారాన్ని పాటిస్తూ హోలీని జరుపుకుంటారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలో హోలీ పండుగ వేడుకల్లో వింత ఆచారాన్ని కొనసాగిస్తుంటారు. గ్రామంలోని మగవాళ్లంతా ఆడవాళ్ల వేషాల్లోకి మారిపోతారు. చాలా విచిత్రమైన ఆచారంతో అక్కడి ప్రజలు పండుగను జరుపుకుంటారు. మగవారంతా మహిళ వేషధారణలో రతి మన్మధుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. దశాబ్దాలుగా గ్రామస్తులంతా కలిసికట్టుగా ఈ హోలీ పండుగ జరుపుకోవడం విశేషం. అక్కడ పురుషులు ఆడవారి వేషధారణలో మొక్కులు తీర్చుకుంటారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో కరువు, కాటకాలు రావని అక్కడి స్థానికుల నమ్మకం. కరువు, కాటకాలు రాకుండా ఉండాలంటే ఆ గ్రామంలో పురుషులంతా చీర కట్టడం తప్పదు మరి. మగవారంతో ఆడవారిలాగా చీరలు కట్టుకుని, ఆభరణాలు పెట్టుకుని అమ్మాయిల మాదిరిగా రెడీ అవుతారు. ఇలా చేయడం వల్ల కోరిక కోరికలు తీరుతాయని అక్కడి వారు బలంగా నమ్ముతారు. మరోవైపు ఇక్కడి వింత ఆచారాన్ని చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు తరలివస్తుంటారు. అంతే కాకుండా వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వారు కూడా మగవాళ్లంతా ఆడవారి వేషధారణలోకి మారిపోయి రతీమన్మధుడికి పూజిస్తారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా చేస్తే అంతా మంచే జరుగుతుందనే వారి విశ్వాసం. ఇలా ప్రతీ ఏడాది కూడా రెండు రోజుల పాటు మగవారంత కూడా మహిళల వేషధారణలో పూజలు చేస్తుండటమే అక్కడి ప్రత్యేకత. ఈ సంప్రదాయాన్ని అక్కడి వారు పాటించడం శుభంగా భావిస్తారు.

# నా అజెండా అనంతపురం అభివృద్ధి మాత్రమే : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం (చైతన్యరథం): శిలాఫలకాల విషయంలో ఓ నేత చేసిన వ్యాఖ్యలకు.. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎవరెవరో ఏవేవో మాట్లాడుతున్నారని.. నేను అవన్నీ పట్టించుకోనని.. నా అజెండా అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. 40 ఏళ్ల నుంచి వారు చేయలేని పనులు నేను చేసి చూపిస్తానంటూ దగ్గుపాటి వ్యాఖ్యానించారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన 7మందికి 9లక్షల 50వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఇప్పటి వరకు 78 లక్షల రూపాయలు సీఎంఆర్ కింద సాయం చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తామిచ్చిన హామీల్లో మొదటి ఐదు సంతకాలు కీలకమైన వాటిపై చేసినట్టు వివరించారు. పింఛన్ల పెంపు, 16 వేలకు పైగా వరకు డీఎస్సీ పోస్టులు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటివి ఉన్నాయని చెప్పారు. పట్టణాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అసెంబ్లీలో తనకు రెండుసార్లు మాట్లాడే అవకాశం వచ్చిందని.. నగరంలో ప్రధాన సమస్యలుగా ఉన్న డంపింగ్ యార్డ్, ప్రొడక్షన్ వాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గురించి మాట్లాడినట్లు వివరించారు. అక్టోబర్ రెండు లోపు డంపింగ్ యార్డ్‌ను క్లియర్ చేసి చూపిస్తామన్నారు. 88 కోట్లతో మరువవంక, నడిమివంక ప్రొటెక్షన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా త్వరలో మంజూరవుతుందని.. ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. గత 15ఏళ్లలో జరగని అభివృద్ధిని ఈ ఏడు నెలల్లోనే చేసి చూపిస్తున్నామన్నారు. రుద్రంపేట రోడ్డు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని.. తాను వచ్చిన ఆరు నెలల్లోనే రోడ్డు వేసినట్లు చెప్పారు. రూ.40కోట్లతో నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. అనంతపురం నగరాన్ని గతంలో పాలించిన నాయకులు 40 ఏళ్లుగా చేయని వాటిని నేను చేసి చూపిస్తానన్నారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్‌గా మార్చడమే తన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ స్థలాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని.. ఆక్రమించిన స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకొని పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలలు నిర్మిస్తామని ఎమ్మెల్యే దగ్గుబాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సైఫుద్దిన్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోపాల్ గౌడ్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాస్ తదితరులు పాల్గొన్నారు.

# టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకొస్తాం : టీజీ భరత్





కర్నూలు (చైతన్యరథం): ఆరు నెలల్లో ఇంటిగ్రేటెడ్ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. శుక్రవారం పత్తికొండ మండలం, దూదేకొండ రెవెన్యూ గ్రామం, కోతిరాళ్ళ పంచాయతీ వద్ద రూ.11 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు మంత్రి టీజీ భరత్... ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి భూమి పూజ నిర్వహించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కర్నూలు ఎంపీ, పత్తికొండ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అందుకు సంబంధించిన పనులు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం జరిగిందన్నారు. ఆ మేరకు ఈ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు ఏర్పాటు 6 నెలలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి.. ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ, కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. జిల్లాలో పత్తికొండ ప్రాంతంలో టొమాటో పంట సాగు చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ యూనిట్ ఏర్పడిన తర్వాత టొమాటోలు రోడ్ల మీద పడేసే పరిస్థితి ఎక్కడ ఉండదన్నారు. రానున్న రోజుల్లో ప్రైవేట్ వ్యక్తులు కూడా చాలా మంది ఈ యూనిట్‌లు పెట్టేందుకు ముందుకు వస్తారన్నారు. అదే విధంగా తుగ్గలి, దేవనకొండ, క్రిష్ణగిరి, ఆదోని, గొనేగండ్ల, ఆస్పరి, ఆలూరు ప్రాంతాల వారికి ఈ యూనిట్ చాలా ఉపయోగపడే అవకాశం ఉంటుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకి సంబంధించి కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించిన సమయంలో ఈ 5 ఏళ్లలో 30 వేల కోట్ల పెట్టుబడులు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ద్వారా రావాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, టార్గెట్ పెట్టుకొని కష్టపడుతున్నట్లు చెప్పారు. దుబాయికి వెళ్ళిన సమయంలో ఫుడ్ ప్రాసెసింగ్‌కి సంబంధించి చాలా మంది పారిశ్రామిక వేత్తలను కలవడం జరిగిందన్నారు. వారిని కూడా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని రిక్వెస్ట్ చేయడం జరిగిందన్నారు.. ఫుడ్ ప్రాసెసింగ్‌కి సంబంధించిన వాటిలో ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువ స్థాయిలో వచ్చే అవకాశం ఉందన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ... పింఛన్ల పంపిణీ నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పత్తికొండకు వచ్చిన సందర్భంగా మన ప్రాంతానికి టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరామని, ఆ మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.11 కోట్లతో టమోటా ప్రాసెస్ యూనిట్‌కు శంకుస్థాపన జరిగిందన్నారు. ఓర్వకల్లు మండలంలో కూడా ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేయాలని మంత్రి, జిల్లా కలెక్టర్‌ని పార్లమెంటు సభ్యులు కోరారు. ఈ కూటమి ప్రభుత్వంలోనే కర్నూలు నుండి బళ్లారికి హైవే రోడ్డు నిర్మాణం కొరకు కేంద్ర మంత్రిని కోరడం జరిగిందన్నారు. సాధ్యమైనంత వరకు ఈ ప్రభుత్వ హయాంలోనే రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేయడం జరుగుతుందని ఎంపీ అన్నారు.

# అధిక ధర కల్పిస్తానంటూ రైతను మోసం చేసిన వ్యాపారి

ఉరవకొండ (చైతన్యరథం): అధిక ధరకు శనగలు విక్రయించి లాభాలు వచ్చేలా చేస్తామని రైతును నమ్మించి మోసగించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రేణుమాకులపల్లికి చెందిన దేవినేని భాస్కర్‌కు 30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2022, 2023లో శనగ పంటను సాగు చేయగా 450 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇది చూసిన కణేకల్లు మండలం మాల్యంకు చెందిన వ్యాపారి తిప్పారెడ్డి, హనుమాపురానికి చెందిన రమేష్ కలిసి భాస్కర్ దగ్గరకు వెళ్లారు. శనగ పంటను తమకు ఇస్తే ఇతర రాష్ట్రాల్లో విక్రయించి లాభాలు తెచ్చి వాటాలు పంచుకుందామని నమ్మబలికారు. క్వింటాళ్లు రూ.5,800 ప్రకారం 26 లక్షల 10 వేల రూపాయల విలువైన 450 క్వింటాళ్లు శనగలు కొనుగోలు చేశారు. అయితే అప్పుడు కేవలం 2 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి మిగతా డబ్బులు నెల రోజులకి ఇస్తామని ఖాళీ కాగితం మీద సంతకాలు పెట్టి ఇచ్చారు. అయితే రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా వ్యాపారులు మొహం చాటేశారు. డబ్బులు ఇవ్వాలని రైతు ఒత్తిడి చేయడంతో బెదిరింపులకు దిగారు. తనకు న్యాయం చేయాలంటూ రైతు భాస్కర్ ఉరవకొండ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వ్యాపారులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ నాయుడు వెల్లడించారు.

# అరచేతిలో ప్రాణాలు ...
# స్వర్గధామంలో అనుభూతులు!





హిమాచల్ ప్రదేశ్ అనగానే ప్రకృతి అందాలు, అందమైన కొండలు, లోయలు గుర్తుకువస్తాయి. అయితే ఆ కొండలు మెలికలు తిరుగుతూ, లోయలకు దగ్గరగా ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లో ప్రయాణం భయంకరంగా ఉంటుంది. ఈ దారిలో వాహనాలు నడిపించడం సాహసమనే చెప్పాలి. అయితే హిమాచల్ ప్రదేశ్ ఆర్టీసీ బస్సులో తాను ప్రయాణించిన వీడియోను ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాలో షేర్ చేస్తూ.. తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించామంటూ రాసుకొచ్చారు. హిమాచలక్కు వెళ్లినవారు ఎప్పుడైనా అక్కడి ప్రజా రవాణా సదుపాయాలను వినియోగించుకున్నారా అంటూ ప్రశ్నించారు. ఆ వీడియోలో వారి ప్రయాణం వంపులు తిరిగిన కొండ అంచుల్లో భయంభయంగా సాగిన దృశ్యాలు కనిపిస్తు న్నాయి. ఈ వీడియోను చూసిన నెటిజన్లు అక్కడి డ్రైవర్ల ధైర్యాన్ని కొనియాడుతున్నారు. అంత క్లిష్ట పరిస్థితుల్లోనూ బస్సులను జాగ్రత్తగా నడుపుతూ ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న వారి పనితీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. నెటిజన్ స్పందిస్తూ.. ఇది చంబా అనే ప్రాంతం నుంచి పంగి అనే మరో ప్రాంతానికి వెళ్లే రహదారి అని పేర్కొన్నారు. "హిమాచల్లోని ప్రజలు కొండల అంచున కాదు.. తమ జీవితాల అంచున ప్రయాణం చేస్తారు" అని మరో నెటిజన్ తన అభిప్రాయం వ్యక్తంచేశారు.

## పెళ్లి పందిరిలో పోలీసులపై దాడి

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని ముంగర్ జిల్లాకు చెందిన రాజీవ్ రంజన్ మాల్ ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బుధవారం పేరు మోసిన క్రిమినల్ అన్మోల్ యాదవ్‌ను పట్టుకోవడానికి ఫుల్‌కాహా జిల్లాకు వెళ్లాడు. రాజీవ్‌తో పాటు మరికొంత మంది పోలీసులు కూడా వెళ్లారు. ఫుల్‌కాహా జిల్లాలోని లక్ష్మీపూర్ గ్రామంలో జరుగుతున్న పెళ్లిలో అన్మోల్ ఉన్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. వారు పెళ్లి జరుగుతున్న చోటుకు వెళ్లారు. అన్మోల్‌ను అరెస్ట్ చేశారు. అతడ్ని స్టేషన్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే, గ్రామస్తులు అన్మోల్‌ను అక్కడ ి నుంచి తీసుకెళ్లకుండా పోలీసులను అడ్డుకున్నారు. పోలీసులతోటే గొడవకు దిగారు. వారిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ నేపథ్యంలోనే అన్మోల్ అక్కడినుంచి పారిపోయాడు. గ్రామస్తుల దాడిలో రాజీవ్ రంజన్ తీవ్రంగా గాయపడ్డాడు. అయన్ని హుటాహుటిన అరారియా జిల్లాలోని సదర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాజీవ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తేల్చారు. రాజీవ్ మరణ వార్త తెలిసి ఆయన కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. జిల్లా ఎస్పీ ఈ సంఘటనపై స్పందించారు. రాజీవ్ మరణానికి సరైన కారణం ఏమిటో పోస్టు మార్టమ్ రిపోర్టులో తెలుస్తుందని అన్నారు. ఇక, రాజీవ్ మరణానికి కారణం అయిన అన్మోల్ అనుచరులు ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం అన్వేషిస్తున్నారు. గ్రామస్తులు పోలీసుపై దాడి చేసి చంపేసిన ఈ సంఘటన దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇలాంటి సంఘటనలు మరో సారి పునరావృతం కాకుండా.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

## వికటించిన విశ్రాంత ఉద్యోగి హత్యాయత్నం

### అమాయకురాలి ఆఖరిపోరాటం



పొరుగింటివారిపై ఉన్న కోపంతో ఒక విశ్రాంత ఉద్యోగి చేసిన హత్యాయత్నం ఓ మహిళ పాలిట శాపమైంది. దాంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రమాదానికి గురైనప్పుడు జాతీయ మీడియాలో వచ్చిన దృశ్యాలు ఒళ్లు గగుర్పొడుస్తున్నాయి.

కర్ణాటకలోని మంగళూరుకు చెందిన బెజాయ్ ప్రాంతంలో ఉండే సతీశ్ కుమార్ విశ్రాంత ఉద్యోగి. అయనకు పొరుగింటి మురళీప్రసాద్‌తో గొడవలు ఉన్నాయి. ఉదయం పూట ప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా.. అతడిని చంపేందుకు అప్పటికే ఎదురు చూస్తున్న సతీశ్ కారును వేగంగా డ్రైవ్ చేశా డు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ మహిళను వేగంగా వచ్చిన సతీశ్ కారు ఢీ కొనడంతో..ఆమె ఎగిరి, పక్కనే ఉన్న ప్రహరీ గోడ చువ్వలపై పడింది. వాటిపై వేలాడుతూ కనిపించిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

దీన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, ఆమెను కిందికి దించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలపాలైన ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మరోవైపు బైక్‌పై వెళ్తున్న మురళీప్రసాదును కారు కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం జరిగింది. 2023లో కూడా సతీశ్.. ప్రసాద్ తండ్రితో ఘర్షణ పడి, బైక్‌పై వెళ్తున్న ఆయన్ను ఢీకొట్టారు. దాంతో అప్పట్లో సతీశ్‌పై కేసు నమోదైంది. ఇప్పుడు మరోసారి అదే తరహాలో ప్రవర్తించారు. హత్యాయత్నం కింద ఉర్వా పోలీస్ స్టేషన్లో సతీశ్‌పై మరోసారి కేసు నమోదైంది. నిందితుడి కారును సీజ్ చేశారు. నిర్లక్ష్యంగా కారు నడిపి, ఓ మహిళను గాయపరిచిన కేసులో మంగళూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

### అంబరాన్ని చుంబించిన హోలీ సంబరాల్లో

## భలే మంచి ఖరీదైన కజ్జికాయ

దేశవ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేస్తున్నారు. హోలీ వేళ.. నోరు తీపి చేసుకునేందుకు పక్కాగా స్వీట్ ఉండా ల్సిందే..! ఈ క్రమంలో మార్కెట్లో రకరకాల స్వీట్లు దర్శనమిస్తున్నాయి. ఇక, ఉత్తర ప్రదేశ్లోని ఓ దుకాణదారు తయారు చేసిన కజ్జికాయలు నోరూరిస్తున్నాయి. కానీ, వాటి ధర చూసి కస్టమర్లు అవాక్క వుతున్నారు. అవును మరి, ఆ కజ్జికాయల ధర కేజీ రూ.50 వేలంట. ఎందుకు.. బంగారంతో ఏమైనా తయారుచేశారా? అంటే అవునని అంటున్నారు ఆ యజ మాని..! 24 క్యారెట్ల పుత్తడితో చేసిన ఈ మిఠాయిలు అందర్నీ ఆకట్టు కుంటున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో హోలీ సందర్భంగా ఓ స్వీట్ షాపు వ్యాపారి 'బంగారు కజ్జికాయలు' తయారుచేసి అమ్మకానికి పెట్టారు. వీటి ధర కేజీ రూ.50వేలు అని బోర్డు పెట్టారు. ఒక్క స్వీటు చాలనుకుంటే దానికి రూ.1300లు చెల్లించాలి. ఆకజ్జికాయల పైన 24క్యారెట్ల బంగారు పూత పూయడంతో పాటు అందులో ప్రత్యేకమైన డ్రైఫ్రూట్లు నింపిన ట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈ మిఠాయిల ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారగా.. నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.



#### ఇండియా బుక్ఆఫ్ రికార్డులో కజ్జికాయ..

ఇదిలాఉండగా.. లఖ్నవూలోని మరో స్వీట్ షాపు దేశంలోనే అతి పెద్ద కజ్జికాయను తయారుచేసి రికార్డు సృష్టించింది. ఆరు కేజీల బరువుతో 25అంగుళాలు ఉన్నఈ కజ్జికాయ ఇండియా బుక్అఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కించు కుంది. ఈ విషయాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. మునుపటి రికార్డులను ఈ కజ్జికాయ బద్దలు కొట్టిందని వెల్లడించారు. ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచు కున్న టీమిండి యాకు అభినందనలు తెలు పుతూ ఈ మిఠాయిని మువ్వన్నెల రంగుల్లో ప్రత్యేకంగా తయారుచేశారు.

## పోలీసును కొట్టి చంపేశారు

### దొంగ కోసం గ్రామస్తుల దుర్మార్గం

ఒకప్పుడు పోలీసులంటే జనం భయపడి చచ్చేవారు. వారి దగ్గరకు వెళ్లాలంటే జడుసుకునే వారు. ఊర్లోకి పోలీ సులు వస్తే ఒణికిపోయేవారు. ఇప్పుడు కాలం మారింది. పోలీసులంటే భయం పూర్తిగా పోయింది. జనం దెబ్బకు దెబ్బ అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. సాధారణ పౌరులు పోలీసులపై తిరగబడి దాడులు చేసిన సంఘటనలు లెక్కలేనన్ని ఉన్నాయి. పోలీసులు తప్పుగా ప్రవర్తించినపుడు తిరగబడ్డంలో న్యాయం ఉండొచ్చు. కానీ, ఎలాంటి తప్పు చేయక పోయినా విధి నిర్వహణలో ఉన్న వారిని చంపటం ఎంత వరకు సమంజసం. బిహార్‌లో సభ్య సమాజం తలదించు కునే ఓ సంఘటన జరిగింది. దొంగను కాపాడ్డానికి గ్రామ స్తులు పోలీసులపై దాడికిదిగారు. వారిని చావ చితక్కొట్టా రు. ఈ దాడిలో ఓ పోలీసు అధికారి ప్రాణాలు విడిచాడు. బుధవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## పరదేశాలపై నిందలు మానుకోవాలి

### - అఫ్గానిస్థాన్

రైలు హైజాక్ వెనక అఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. పాక్ చేస్తున్న నిరాధార ఆరో పణలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. పాక్ బాధ్యతారహిత వ్యాఖ్యలు వారి దిగజారుడు విధానాలకు నిదర్శనమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోలేని పాక్ ఇతర దేశాలపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికింది.

## మైసూరు రాజుల ఆస్తులపై రాజకీయమా

- గ్యారెంటీ పథకాల పక్కదారి
- దృష్టి మళ్లించడానికి వివాదాల సృష్టి
- స్థలం లాక్కోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర
- మాజీ మంత్రి బీజేపీ నేత శ్రీరాములు

మైసూరు రాజుల కాలం నాటి హరెమనె స్థలం విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం సరి కాదని మాజీ మంత్రి, బీజేపీ నాయకులు బి.శ్రీరాములు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఉత్తర కర్ణాటక బళ్లారి లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో మైసూరు రాజులంటే ప్రత్యేక అభిమానముందని, అది రాజుల కాలం నుంచి వచ్చిన ప్రతిష్ట,అలాంటి మైసూరు రాజులకు చెందిన స్థలం విషయంలో కాంగ్రెస్ పార్టీ దురుద్దేశంతో లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. మైసూరు రాజ వంశస్థుడైన యధువీర్ బీజేపీ ఎంపీ కావడంతో ఆయనపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. రాజుల కాలంనాటి స్థలాన్ని వివాదంలోకి లాగడం సరికాదన్నారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నా లాక్కోవాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీ పథకాల పరిశీలనకు కమిటీ వేసి అందులో రూ.300కోట్లు నిధులు కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తున్నారని ఆరోపించారు. కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బళ్లారి గడిగె చెన్నమ్మ సర్కిల్ విషయం లో బీజేపీ ప్రభుత్వం ఒక మోడల్‌గా తయారు చేయాలను కుంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాన్ని మార్చి ప్రజ లకు ఇబ్బంది కలిగేలా చేశారని ఆరోపించారు. లెబనాన్ దేశంలో పెన్సిల్ తరహాలో ఉండే స్తూపం ఆధారంగా ఇక్కడ అలా చేయాలని చూస్తే, దాని రూపు రేఖలు మార్చే శారని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రాగానే పూర్తి స్థాయిలో గడిగె చెన్నప్ప సర్కిల్‌ను తీర్చిదిద్దుతామన్నారు.



### ఐరోపా సమాఖ్య పార్లమెంట్‌లో

## చైనా సంస్థ లంచాల కలకలం

ఐరోపా సమాఖ్య పార్లమెంట్‌లో లంచాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తమకు అనుకూలంగా సభ్యులు నిర్ణయాలు తీసుకునేందుకు చైనాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ హువావే సొమ్ములు చెల్లించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో బెల్జియం ప్రాసిక్యూటర్లు దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే ఈ వ్యవహారంతో సంబంధమున్న పలువురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరు పలు పత్రాలను ఫోర్జరీ చేసి వాడినట్టు కూడా అనుమానిస్తున్నారు. నిధులు స్వీకరించడం, ప్రయాణ, ఆహార ఖర్చులు భరించడం, ఫుట్బాల్ మ్యాచ్‌ల ఇన్విటేషన్లు వంటివి తీసుకొన్నట్టు ఆరోపణలు నమోదయ్యాయి. మనీ లాండరింగ్ కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారంలో హువావే లబ్ది పొందినట్టు ప్రాసిక్యూటర్లు చెబుతున్నారు.. 2021నుంచి ఈ తతంగం కొనసాగుతోందని భావిస్తున్నారు. దాదాపు 100మంది పోలీసులు బెల్జియం, పోర్చుగల్‌లో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వివరాలను మాత్రం వెల్లడించలేదు. వీరిలో ఐరోపా సమాఖ్య పార్లమెంట్ సభ్యులు మాత్రం లేరని వెల్లడించారు. కానీ, దాదాపు డజనుమంది పార్లమెంట్ సభ్యులు దర్యాప్తు బృందం గురిలో ఉన్నారని బెల్జియం పత్రికలు కథనాలు వెలువరించాయి. ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బెర్గ్‌లోని ఈయూ పార్లమెంట్ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు అసిస్టెంట్ల ఆఫీసులను సీజ్ చేశారు.

## రష్యా చమురు కొనుగోలు ఆపేసిన చైనా

### యుద్ధ నేపథ్యంలో ఆంక్షలే కారణమా?



తన మిత్రదేశం రష్యా చమురుకు చైనా దూరం జరుగుతోంది. ఈ నెలలో రెండు సంస్థలు పూర్తిగా ఆయిల్ కొనుగోలు నిలిపివేయగా, మరో రెండు సంస్థలు పరిమాణాన్ని తగ్గించుకున్నాయి. ఈ ఏడాది జనవరిలో రష్యా చమురు ఉత్పత్తిదార్లు, ట్యాంకర్లపై అమెరికా కఠిన ఆంక్షలు విధించిన నేపథ్యంలో కొనుగోలు తగ్గుముఖం పట్టాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలయ్యాక, పుతిన్ ప్రభుత్వానికి చైనా, భారత్ అతి పెద్ద చమురు కొనుగోలుదారులుగా మారిన సంగతి తెలిసిందే. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చమురు సరఫరా తగ్గుతుందన్న ఆందోళనల మధ్య భారత్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. దీంతో గత నెలలో లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి భారత్‌కు ముడిచమురు దిగుమతులు పెరిగాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. రష్యా నుంచి మన చమురు కొనుగోలు జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో 3శాతం తగ్గి రోజుకు 1.54 మిలియన్ బ్యారెళ్ల (బీపీడీ)కు పరిమితమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. మన మొత్తం చమురు దిగుమతుల్లో లాటిన్ అమెరికా వాటా 9 శాతానికి చేరింది. 2021 డిసెంబరు తర్వాత ఇదే అత్యధికం. రష్యా వాటా కాస్త తగ్గి 30.5 శాతానికి చేరింది. ప్రస్తుతం ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం శాంతి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాల్పుల విరమణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ చర్చల ఫలితంగా ఆంక్షలు సడలించడం, తొలగించడంకానీ జరిగితే మళ్లీ కొనుగోళ్లు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు.

# మళ్లీ రెచ్చిన ఉక్రెయిన్

### క్రెమ్లిన్ సమీపంలో భవనాన్ని తాకిన డ్రోన్



ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతుంటే వారం వ్యవధిలో రష్యాపై ఉక్రెయిన్ రెండోసారి డ్రోన్లతో దాడికి పాల్పడింది. అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ సమీపంలో ఉన్న భవనాన్ని ఒక డ్రోన్ ఢీకొట్టింది. రష్యా అధికారులతో చర్చల కోసం అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్.. మాస్కోకు రహస్యంగా వెళ్లినట్టు వార్తలు వచ్చిన తరుణంలో ఈ దాడి చోటుచేసుకుంది. కాగా, ఆ డ్రోన్లను తమ వైమానిక దళం అడ్డుకుందని మాస్కో మేయర్ వెల్లడించారు. మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో ఇటీవల రష్యాపై ఉక్రెయిన్.. అతి పెద్ద దాడి చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సోమవారం రాత్రి వందల డ్రోన్లతో విరుచుకుపడింది. 10 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ చేసిన ఈ దాడులను రష్యా విజయవంతంగా అడ్డుకుంది. క్షిపణి రక్షణ వ్యవస్థలతో 337 డ్రోన్లను కూల్చేసింది. ఈ దాడుల కారణంగా ఒకరు మృతి చెందగా 9మంది గాయపడ్డారు. పలు భవనాలు, కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాజధాని మాస్కో లక్ష్యంగానే 70 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడులు చేసిందని, వాటిని కూల్చేశామని మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో విమానాశ్రయాల్లో కొద్దిసేపు విమానాలను నియంత్రించాల్సి వచ్చింది. మాస్కో రీజియన్‌లోని డొమోడెడోవో రైల్వే స్టేషన్‌లో రైళ్లను కొద్దిసేపు నిలిపేశారు.

# యాతన అనుభవించాం

### రైలు హైజాక్ ఘటన బందీలు



పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటనలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ అదుపులో ఉన్న పలువురిని సైనిక బలగాలు సురక్షితంగా విడిపించాయి. మిలిటెంట్ల చెరలో తాము అనుభవించిన కష్టాలను వారు గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాదులు రైలు ఇంజిన్ కింద పేలుడు పదార్థాలు అమర్చి పేల్చడంవల్ల బోగీలు పట్టాలు తప్పాయని రైలు డ్రైవర్ అజ్జాద్ పేర్కొన్నాడు. రైలు ఆగిన వెంటనే ఉగ్రవాదులు కిటికీలను పగలగొట్టి ఆయుధాలతో బోగీలలోకి చొరబడ్డారని తెలిపాడు. అసలు ఏంజరుగుతుందో అర్థం కాలేదని అన్నాడు. తమను కాపాడడానికి ప్రయత్నించిన సైనికులను దారుణంగా హత్య చేశారని.. పారిపోవడానికి ప్రయత్నించినవారిని కాల్చి చంపడంతో భయంతో తాము అక్కడే ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. మహిళలు, చిన్న పిల్లలపై కూడా మిలిటెంట్లు దాడి చేశారన్నారు. మహబూబ్ అహ్మద్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. వేర్పాటువాదులు తమను బందీలుగా చేసుకున్నారని తెలియడంతో ఇక తాము జీవితంపై ఆశలు వదులుకున్నామన్నాడు.రైలులో మృతదేహాలను చూసి భయంతో వణికి పోయినట్లు తెలిపాడు.

బందీలుగా చేసుకున్న తమను మారుమూల పర్వత ప్రాంతాలలో గంటల తరబడి నడిపించుకుంటూ తీసుకువెళ్లి.. వివిధ ప్రదేశాలలో బంధించారని తెలిపాడు. 27 గంటలపాటు తమను మోకాళ్లపైనే కదలకుండా కూర్చోబెట్టారని గుర్తు చేసుకున్నాడు. అప్పుడప్పుడు తాగడానికి నీరు తప్ప ఎటువంటి ఆహారం ఇవ్వలేదని.. పిల్లలు ఆకలితో గుక్కపట్టి ఏడుస్తున్నా కనికరం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పాక్ భద్రతా దళాలు తమను విడిపించడానికి తీవ్రంగా శ్రమించాయని.. అందుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని అన్నాడు. పాకిస్థాన్‌లో 500మంది ప్రయాణికులతో వెళుతున్న రైలు హైజాక్‌కు గురైన ఘటనలో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ కొనసాగుతోంది. బలోచ్ లిబరేషన్ ఆర్మీ అదుపులో ఉన్న బందీల్లో 80మందిని సైనిక బలగాలు సురక్షితంగా విడిపించాయి. వీరిలో 43 మంది పురుషులు, 26 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారు. మిలిటెంట్ల అదుపులో ఇంకా వందమందికి పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు జరిగిన కాల్పుల్లో 33మంది మిలిటెంట్లు చనిపోయినట్లు పాక్ ప్రభుత్వ అధికారులు తెలిపారు.

### అణ్వాయుధాలు కోరిన పోలాండ్

## నిరాకరించిన డొనాల్డ్ ట్రంప్

రష్యా దూకుడుకు కళ్లెం వేసేలా అమెరికా అణ్వాయుధాలను తమ దేశంలో మోహరించాలన్న పోలాండ్ అభ్యర్థనను అమెరికా తిరస్కరించింది.తాజాగా అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయాన్ని వెల్లడించారు. పోలాండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ డూడా ఇటీవల మాట్లాడుతూ.. అమెరికా పశ్చిమ ఐరోపాలో భద్రపర్చిన అణ్వాయుధాలను పోలాండ్‌లో మోహరించవచ్చు అని పేర్కొన్నారు. గతంలో డూడా ఇలాంటి ప్రతిపాదనను జో బైడెన్ వద్ద చేయగా.. ఆయన అందుకు నిరాకరించారు. తాజాగా ఈ అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. తాను ఈ అంశంపై అధ్యక్షుడు ట్రంప్ చర్చించినట్లు పేర్కొన్నారు. ఒకవేళ ఐరోపా తూర్పు సరిహద్దులకు అణ్వాయుధాలను విస్తరించాలన్న అభ్యర్థనకు ఆయన మద్దతు ఇస్తే.. తాను షాక్ అవుతానని పేర్కొన్నారు. గత జో బైడెన్ ప్రభుత్వం నిద్రలో నడుస్తూ మనల్ని ఓ అణు సంక్షోభంలోకి తీసుకెళ్లిందని మండిపడ్డారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపాలంటే ప్రశాంతంగా ఉండే నాయకులు కావాలని తెలిపారు. బైడెన్ కార్యవర్గం ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇచ్చి.. మాస్కో- కీవ్ రక్తసిక్తం అయ్యేలా చేసిందన్నారు. ఇక ట్రంప్ మాత్రం తన మొత్తం కార్యవర్గాన్ని ఈ సంక్షోభంలో మోహరించి.. ఉక్రెయిన్‌కు ఏం కావాలి.. రష్యా డిమాండ్లు ఏమిటీ అనేది అన్వేషిస్తున్నారన్నారు. అసలు ట్రంప్ ఉంటే ఈ యుద్ధమే వచ్చేది కాదని వాన్స్ వెల్లడించారు. తన సరిహద్దుల్లోకి నాటో కూటమి చొచ్చుకురావడంపై ఇప్పటికే రష్యా గుర్రుగా ఉంది. దీనికితోడు రష్యా- ఉక్రెయిన్ల మధ్య నెల రోజుల కాల్పుల విరమణ దిశగా చర్చలు జరుగుతున్న వేళ.. పోలాండ్ అణ్వాయుధాలు మోహరించాలని కోరింది.



# అమెరికా బహిష్కరణ

### భారీ ప్లాన్‌కు బడ్జెట్ కొరత

అమెరికానుంచి వేలాదిమంది అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ బహిష్కరణ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. అయితే, దీనిని నిర్వహిస్తోన్న అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కొత్త సమస్య వచ్చిపడిందట.ఇప్పటికే రెండు బిలియన్ డాలర్ల లోటు బడ్జెట్ ఎదుర్కొంటోన్న ఈ ఏజెన్సీకి.. ఈ మిషన్ ఓ సవాలుగా మారిందని తెలిసింది. అమెరికా నుంచి అక్రమ వలసదారులను పంపించే కార్యక్రమాన్ని ఐసీఈ నిర్వహిస్తోంది. ఇందుకోసం భారీగా ఖర్చు పెడుతోంది. అదనపు సిబ్బంది నియామకం, నిర్బంధ కేంద్రాల సామర్థ్యం పెంపు, అక్రమ వలసదారులను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి వస్తోంది. ఇందుకోసం ఐసీఈకి 500 మిలియన్ డాలర్లు ఇచ్చే బిల్లును కాంగ్రెస్ ఆమోదించింది. ప్రస్తుతం దీనిపై సెనెట్‌లో చర్చ జరుగుతోంది. అయితే, ట్రంప్ అంచనాలకు అనుగుణంగా ఆపరేషన్ కొనసాగించేందుకు ఈ నిధులు ఏమాత్రం సరిపోవని ఐసీఈ చెబుతున్నట్టు తాజా నివేదిక వెల్లడించింది.



ట్రంప్ ప్లాన్ ప్రకారం.. బహిష్కరణ ఆపరేషన్ చేపట్టేందుకు భారీ ఖర్చు అవుతున్నట్లు అంచనా.. భారీ సంఖ్యలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిని నియమించుకోవడం, ఐసీఈ నిర్బంధ కేంద్రాల సామర్థ్యాన్ని లక్ష పడకలకు పెంచడం,డిపోర్టేషన్‌కు విమానాలను విస్తృతంగా వినియోగించడం, ఇందుకోసం అధిక సామర్థ్యం కలిగిన విమానాలు కూడా అవసరమవుతాయని ఐసీఈ భావిస్తోంది. అయితే, తాజాగా కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో సరిపోవని సమాచారం. కాంగ్రెస్‌నుంచి అదనపు నిధులు రాకుంటే ఇతర విభాగాల నుంచి నిధులను మళ్లించే అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.



# ముంబయి జట్టుతో బుమ్రా కలిసేది అప్పుడేనా?

ఆస్ట్రేలియాతో బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సమయంలో గాయపడిన జస్ప్రీత్ బుమ్రా పరిస్థితేంటో ఇంకా తెలియడం లేదు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన అతడు ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడలేదు. ఇప్పుడు ఐపీఎల్ 2025 సీజన్‌లోనైనా బరిలోకి దిగుతాడా? అంటే చెప్పలేని పరిస్థితి. వచ్చేస్తాడని కొందరు.. అసలు లీగ్‌లోనే ఆడకపోవచ్చని మరికొందరు అంటున్నారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత టీమ్ ఇండియా ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లాండుకు వెళ్లనుంది. టెస్టు ఛాంపియన్షిప్ నాలుగో సీజన్ కూడా అప్పుడే మొదలుకానుంది. ఈ క్రమంలో పూర్తిస్థాయి ఫిట్నెస్ సాధించకుండానే బుమ్రాను ఐపీఎల్లో ఆడించేందుకు బీసీసీఐ మొగ్గు చూపించకపోవచ్చనేది పలువురి అభిప్రాయం. ఈ క్రమంలో బుమ్రా గురించి మరొక విషయం బయటకొచ్చింది. అది తప్పకుండా ముంబయి అభిమానులకు సంతోషం కలిగించేదే. ఏప్రిల్ తొలి లేదా రెండోవారంలో ముంబయి జట్టుతో కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. "ఎన్ని మ్యాచ్‌లు మిస్ అవుతాడనేది ఇప్పుడే చెప్పలేం.

తప్పకుండా జట్టుతో చేరే అవకాశముంది. తేదీ మాత్రం కచ్చితంగా తెలియదు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మెడికల్ టీమ్ నుంచి క్లియరెన్స్ రావాలి" అని ఓ క్రీడా ఛానల్ పేర్కొంది. ముంబయి ఇండియన్స్ మార్చి 23న తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. మార్చి 29న అహ్మదాబాద్‌లో గుజరాత్‌ను ఢీకొట్టనుంది. బుమ్రా తొలివారం ముగిశాక వస్తే.. అప్పటికీ ముంబయి ఐదు మ్యాచ్‌లు ఆడేస్తుంది. ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడకుండా ఉండాలంటే ముంబయి కనీసం మూడు మ్యాచులైనా గెలిచి ఉండాలి.



# మిస్టర్ ఫిక్స్ ఇట్..

## రాహుల్‌పై ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ ప్రశంసలు

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్ ఇండియా కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. సెమీస్‌లో ఆసీస్‌ను, ఫైనల్లో న్యూజిలాండును ఓడించి మరీ భారత్ విజేతగా నిలిచింది. టీమ్ ఇండియా గెలుపులో ప్రతి ఆటగాడూ కీలక పాత్ర పోషించారు. అయితే, కేఎల్ రాహుల్ కొత్త పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయాడు. పెద్దగా అనుభవం లేని ఆరోస్థానంలో బ్యాటింగుకు వచ్చి విలువైన పరుగులు రాబట్టాడు. వికెట్ కీపింగ్‌లోనూ మెరుగ్గానే రాణించాడు. ఈక్రమంలో కేఎల్‌పై ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ప్రశంసల వర్షం కురిపించాడు. గాయం కారణంగా స్టార్క్ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడలేకపోయాడు. భారత జట్టులో 'మిస్టర్ ఫిక్సిట్' కేఎల్ రాహులేనని స్టార్క్ తెలిపాడు. "ఆ మాట అనడానికి చాలా కారణాలున్నాయి. జట్టుకోసం ఓపెనింగ్ చేస్తాడు. లేదు మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయమంటే అక్కడా ఆడతాడు. కీపింగ్ చేస్తాడు. కీపర్‌గా కాదు ఫీల్డింగ్ చేయమంటే అందుకూ ఓకే చెబుతాడు. ప్రతి దానికి అతడు అర్హుడే. అన్ని పాత్రలనూ పోషించాడు. అతడితో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని స్టార్క్ వెల్లడించాడు.



# 'నా జట్టుకు రోహితే కెప్టెన్'

ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా విజేతగా నిలిచింది. భారత కెప్టెన్ రోహిత్‌శర్మ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్ జట్టును గెలిపించాడు. అయితే, ఐసీసీతోపాటు ఇతర మాజీలు ప్రకటించిన జట్టులో అతడికి చోటు ఇవ్వలేదు. కానీ, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ మాత్రం తన జట్టుకు సారథిగా రోహిత్‌నే ఎంపిక చేస్తానని వెల్లడించాడు. ఆమేరకు బసిత్ ప్రకటించిన టీమ్‌లో భారత్‌నుంచి ఏకంగా ఆరుగురికి అవకాశం ఇవ్వడం గమనార్హం. "నేనుకూడా 11 మందితో కూడిన జట్టును ఎంపిక చేశా. దుబాయ్ వేదికగా మ్యాచ్‌లను చూశాం. గడాఫీ స్టేడియంలోనూ మంచి ప్రదర్శనలు ఇచ్చారు. నేను ఏ ఆటగాడు బాగా ఆడాడని భావించానో వారితోనే తుది జట్టును ప్రకటిస్తున్నా. ఐసీసీ జట్టును సరిపోల్చడం లేదు. నా టీమ్ కెప్టెన్‌గా రోహిత్ ఉంటాడు. టోర్నీ ఆసాంతం సారథిగా అద్భుతంగా రాణించాడు. ఫైనల్లో అర్ధశతకం సాధించాడు. మ్యాచ్‌గతినే మార్చేశాడు. రోహిత్‌కు జోడీ ఓపెనర్‌గా రచిన్ రవీంద్రను ఎంపిక చేశా. అతడు రెండు సెంచరీలు చేశాడు. ఇక వన్డేల్లో విరాట్ కోహ్లినే ఆడాలి. మ్యాచ్ పరిస్థితిని అంచనా వేసి రాణించడం అతడికి అలవాటు. శ్రేయస్ అయ్యర్‌ను నాలుగోస్థానంలో ఆడిస్తా. భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. సెమీస్, ఫైనల్లో విలువైన పరుగులు రాబట్టాడు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా కేఎల్ రాహుల్, ఆరోస్థానంలో గ్లెన్ ఫిలిప్స్ ఆడతారు. అతడు అద్భుతమైన బౌలరే కాకుండా.. ప్రమాదకరమైన ఫీల్డర్ కూడా. అజ్మతుల్లా ఒమర్జాయ్‌రి ఏడో స్థానంలో ఆడిస్తా. ఆల్రౌండర్ పాత్రకు సరిగ్గా సరిపోతాడు" అని వెల్లడించాడు.



# ఇంగ్లాండ్‌తో ఈజీ కాదు..

## ఐపీఎల్‌తోపాటు.. టెస్టులపైనా దృష్టి పెట్టాలి: సిద్ధూ

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచిన టీమ్ ఇండియా ఆటగాళ్లకు అంతర్జాతీయ క్రికెట్‌పరంగా భారీ విరామమే దొరికింది. జూన్‌లో ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌ను భారత్ ఆడనుంది. ఆలోగా మెగా లీగ్ ఐపీఎల్‌తో ప్లేయర్లు బిజీగా గడపనున్నారు. ఈక్రమంలో భారత జట్టుకు మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సిద్ధూ కీలక సూచనలు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో గత రెండు సిరీసుల్లోనూ టీమ్ ఇండియా ఇబ్బందిపడింది. టెస్టు ఛాంపియన్షిప్ మూడో సీజన్ ఫైనల్‌కూ చేరలేకపోయింది. ఇది దృష్టిలో పెట్టుకుని సిద్ధూ స్పందించాడు. ఇంగ్లాండ్‌తో కఠిన సవాల్ తప్పదని హెచ్చరించాడు. "భారత్‌ను కలవరపెట్టే కీలకాంశమిది. మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ ప్రారంభం కానుంది. ఎవరూ ఐపీఎల్‌లో ఆడకుండా ఉండరు. కానీ, మెగా లీగ్ ముగిసిన వెంటనే ఇంగ్లాండ్ భారత్ టెస్టు సిరీస్ ఆడాల్సిఉంది. ఇదెలా ఉంటుందంటే ఉత్తరధ్రువం నుంచి దక్షిణధ్రువానికి మారిపోయినట్టు పరిస్థితులుంటాయి. మరీ ముఖ్యంగా గతంలో ఇంగ్లాండ్‌తో



టెస్టు సిరీస్ ఆగస్ట్ 4నుంచి మొదలైంది. ఈసారి మాత్రం జూన్‌నుంచే ప్రారంభమై ఆగస్ట్ 2నాటికే ముగియనుంది. అంటే దాదాపు నెలన్నర రోజులముందే ప్రారంభం కానుంది. ఆ సమయంలో పిచ్ పచ్చికతోనే ఉండనుంది. బంతి గమనం మరీ అధికంగా ఉండే అవకాశం లేకపోలేదు" అని సిద్ధూ తెలిపాడు.

### ప్రత్యామ్నాయం ఎవరు?

"స్వదేశంలో ఇంగ్లాండ్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. అసలే ఇప్పుడు వారంతా గాయపడిన పులులు. గత కొద్దికాలంగా ఓటమిపాలై ఉన్నారు. భారత్‌పై విజయం సాధించేందుకు చివరివరకూ పోరాడతారు. కానీ, టీమ్ ఇండియాకు ప్రధాన సమస్య మిడిలార్డర్‌లో ఆడే సరైన ఆల్రౌండర్లు రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ ఉన్నారనుకున్నా.. వీరిలో జడేజా మాత్రమే కాస్త నయం. అదీ అతడు నాలుగైదు వికెట్లు తీయలేడుగా? ఇక పేస్‌లూ జస్ప్రీత్ బుమ్రాపై ఎక్కువగానే ఆధారపడాల్సిన పరిస్థితి. షమీ, అర్షదీప్ కూడా ఉన్నారు. తప్పకుండా మిస్టరీ స్పిన్నర్ను ఇంగ్లాండ్‌కు తీసుకెళ్లాలి. ఆ జట్టు బలహీనత కూడా అదే. వరుణ్ చక్రవర్తిని సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడించలేదు. అతడికి బదులు కుల్దీప్ యాదవ్‌ను బరిలోకి దింపొచ్చు. ఈ నలుగురిలో ఎవరూ కూడా బ్యాటింగ్ చేయలేరు. అదే టీమ్ ఇండియా బ్యాటింగ్ ఆర్డర్‌ను బలంగా మార్చలేకపోవడానికి కారణం. తప్పకుండా ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు ఈ ప్రశ్నలన్నీ భారత్‌కు ఎదురవుతాయి" అని సిద్ధూ వెల్లడించాడు.

# ఇదీ..రామాయణ్ ప్లాన్



బాలీవుడ్ సినిమానుంచి రానున్న పలు భారీ చిత్రాల్లో రణబీర్ కపూర్, సాయిపల్లవి లీడ్‌రోల్స్‌లో దర్శకుడు నితీష్‌తివారి తెరకెక్కిస్తున్న భారీచిత్రం "రామాయణ" ఒకటి. ఇప్పటికే ఇండియన్ సినిమా నుంచి రామాయణ గాథపై అనేక సినిమాలు వచ్చాయి అయినా ఈ సినిమాపైనా భారీ అంచనాలు ఉన్నాయి. మేకర్స్ ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఫస్ట్ పార్ట్‌ని వచ్చే ఏడాది దీపావళికి అనౌన్స్ చేశారు. ఈ ప్రాజెక్టుపై లేటెస్ట్ అప్డేట్ వైరల్‌గా మారింది. పార్ట్ 1 షూటింగ్ ప్రస్తుతానికి పూర్తయ్యినట్టుగా, అలాగే పార్ట్ 2 కూడా షూటింగ్ స్టార్ట్ చేసి పార్ట్ 1 రిలీజ్ నాటికి అంటే వచ్చే ఏడాది నవంబర్ నాటికి పార్ట్ 2 షూటింగ్‌ని కంప్లీట్ చేసి.. తర్వాత పార్ట్ 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు చేసి సినిమాని విడుదల చేయనున్నట్టుగా ఇపుడు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ ప్రాజెక్టులో రాకింగ్‌స్టార్ యష్ రావణ పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే.




# విశ్వంభర పరిస్థితేంటి?

మెగాస్టార్ చిరంజీవి, త్రిష లీడ్‌రోల్స్‌లో యంగ్ డైరెక్టర్ వశిష్ఠ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "విశ్వంభర". ఈ సినిమా ఎప్పుడో విడుదల కావాల్సివున్నా, వాయిదా పడుతూ వస్తోంది. చిరునుంచి చాలాకాలం తర్వాత స్ట్రైట్ సినిమా.. పైగా భారీ విజువల్ వండర్ కావడంతో మొదట్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా షూటింగ్ మళ్లీ చేస్తుండడం, విజువల్స్ ఎఫెక్ట్స్ కూడా మళ్లీ అప్డేట్ చేస్తుండటంతో విశ్వంభర మరింత వెనక్కెళ్లింది. అయితే మే 9న కొత్త డేట్‌గా సినిమా రావచ్చని వినిపించింది కానీ ఇపుడు లేటెస్ట్‌గా ఈ డేట్‌లో చిరు బ్రదర్ పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు అధికారికంగా అనౌన్స్ అయ్యింది. దీనితో ఇపుడు విశ్వంభర పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. విశ్వంభర ఎప్పుడొస్తుంది అనేది చూడాలి. ఈ రెండు సినిమాలకీ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



# చరణ్ ప్రాజెక్టుకు భారీ డిమాండ్



రామ్‌చరణ్ హీరోగా జాన్వీకపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై భారీ ఎక్స్‌పెక్టేషన్సే ఉన్నాయి. ఈ చిత్రాన్ని బుచ్చిబాబు స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిస్తుంటే.. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. దీనికిముందు చరణ్‌నుంచి వచ్చిన గేమ్ ఛేంజర్ ఫెయిల్యూర్ ఎఫెక్ట్ దీనిపై పెద్దగా కనిపించడం లేదనే తెలుస్తుంది. లేటెస్ట్‌గా సినిమా ఓటీటీ డీల్‌పై క్రేజీ రూమర్స్ వినిపిస్తున్నాయి. భారీ ఆఫర్స్‌ని టాప్ ఓటీటీ సంస్థలు సినిమా ముందు ఉంచాయట. మెయిన్‌గా సోనీ లివ్ సంస్థ ఈ సినిమాకి రికార్డు మొత్తం ఆఫర్ చేసినట్టుగా తెలుస్తుంది. కానీ ఈ సినిమా మేకర్స్ మాత్రం వీటికిమించి దిగ్గజ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్‌తో డీల్ ఫైనల్ చేయాలని ప్లానింగ్‌లో ఉన్నట్టు తెలుస్తుంది. అలాగే రామ్‌చరణ్ కూడా ఇందుకే ఎక్కువ ఇంట్రెస్ట్‌గా ఉండడంతో మేకర్స్ నెట్‌ఫ్లిక్స్‌తో టైఅప్ కానున్నట్టుగా టాక్. మరి చూడాలి ఈ సినిమాని ఎవరు సొంతం చేసుకుంటారు అనేది!

# ఈ సక్సెస్ మరపురానిది

హీరో, విలన్.. పాత్ర ఏదైనా సరే తన విలక్షణ నటనతో ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్నారు నటుడు విజయ్ సేతుపతి. ఇటీవల ఆయన తండ్రి పాత్రలో నటించిన చిత్రం 'మహారాజ'. ఈ చిత్రానికి ఉత్తమ నటుడిగా బిహైండ్‌వుడ్స్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విజయ్ సేతుపతి తన కెరీర్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'మహారాజ'కంటే ముందు తన కెరీర్‌లో ఎన్నోఎత్తుపల్లాలు చూశానన్నారు. ఆ సమయంలో అందరూ తన కెరీర్ అయిపోయిందన్నారని చెప్పారు."ఈ సినిమా విజయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోను. ఈ విజయానికి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంటుంది. 'మహారాజ' విడుదలైన తర్వాత నా కెరీర్ ఎంతో మారింది. విజయ్ సేతుపతి అనగానే.. 'మహారాజ'లో యాక్ట్ చేశాడు కదా అని చెబుతున్నారు. ఇది నన్నెంతో భావోద్వేగానికి గురిచేస్తోంది. దీని కంటే ముందు సుమారు మూడేళ్లపాటు నా సినిమాలు సరిగ్గా ఆడలేదు. నా కెరీర్ ముగిసిపోయిందని ఎంతోమంది వ్యాఖ్యలు చేశారు. కానీ,ఈ సినిమా నన్నునేను నిరూపించుకునేలా చేసింది. ఒక సినిమా ఈవిధంగా ప్రపంచానికి కనెక్ట్ అవుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు" అని విజయ్ సేతుపతి చెప్పారు.



నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన 'మహారాజ' చిత్రం గతేడాది జూన్‌లో విడుదలైంది. విభిన్నమైన కాన్సెప్ట్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటించారు. ఒక సాధారణ చిత్రంగా విడుదలైన ఈ చిత్రం అంతటా విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఓటీటీలోనూ కొన్ని వారాలపాటు టాప్‌ట్రెండింగ్‌లో దూసుకెళ్లింది. నవంబర్‌లో దీనిని చైనాలో విడుదల చేశారు. విజయ్ సేతుపతి యాక్టింగ్, తండ్రీ కుమార్తెల ఎమోషన్‌కు అక్కడివారూ కనెక్టయ్యారు. కొన్ని కీలక సన్నివేశాల్లో కన్నీటి పర్యంతమయ్యారు. దీనికి సంబంధించిన విజువల్స్ అప్పట్లో నెట్టింట వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. విజయ్ సేతుపతి ప్రస్తుతం 'ట్రైన్' తోపాటు మరో సినిమాలోనూ యాక్ట్ చేస్తున్నారు.

# డేట్ ఇచ్చేసిన వీరమల్లు



'హరిహరవీరమల్లు' కొత్త విడుదల తేదీ వచ్చేసింది. పవన్ అభిమానులతోపాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రం మే 9న రానున్నట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో సిద్ధమవుతోంది. రెండు భాగాలుగా చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తొలి భాగానికి సంబంధించి చిత్రీకరణ ముగింపుదశకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్‌ను చిత్రబృందం తాజాగా ప్రకటించింది. మే 9న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ కొత్త పోస్టర్ వదిలారు. ఇందులో పవన్, నిధి అగర్వాల్ గుర్రపుస్వారీ చేస్తూ కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌తో టీమ్ ప్రేక్షకులకు హోలీ శుభాకాంక్షలు చెప్పింది. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే కథలో, పవన్ కల్యాణ్ చారిత్రాత్మక యోధుడిగా నటిస్తున్నారు. నిధి అగర్వాల్, బాబీ దేవోల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి కీలక పాత్రలు పోషించారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ దయాకర్రావు నిర్మిస్తున్నారు. ఎఎం రత్నం సమర్పకులు. ఎంఎం కీరవాణి స్వరకర్త.

# 4నుంచి నయనతార 'టెస్ట్'!

కుముద పాత్రలో నయనతార కనిపించనున్న చిత్రం 'టెస్ట్'. స్పోర్ట్స్ డ్రామాగా ఎస్ శశికాంత్ దర్శకత్వంలో రానుంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఏప్రిల్ 4 నుంచి స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. తెలుగు,తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో అందుబాటులోకి రానుంది. ఇందులో నయనతార పాత్రను పరిచయం చేస్తూ తాజాగా వీడియో విడుదల చేశారు. కుముద కల ఏంటో వివరిస్తూ రిలీజైన ఆటీజర్ అందరి నీ ఆకట్టుకుంటోంది చిత్రంలో ఆర్ మాధవన్ కీలకపాత్రలో కనిపించనున్నారు.

